
బొమ్మరిల్లు



నవంబరు '98

ఎడిటర్ : విజయబాపినీడు

27 వ సంవత్సర ప్రచురణ ...12 వ సంచిక

విడిప్రతి : 6 రూ.... సంవత్సరంచందా : 72/-రూ.

బొమ్మరిల్లు

నవంబరు 1998 ఎడిటర్ : విజయబాపినీడు

బొమ్మరిల్లు వెలువడిన మొట్టమొదటి సంచిక : సెప్టెంబరు 1971.



కొంత చరిత్ర , కొంత కల్పన ఆధారంగా వాడుకలో ఉన్న " గజపతి రాజు "ల కథలను ఈ సంచిక నుంచి ప్రారంభిస్తున్నాం.


ఉద్యమాలు చట్టాన్నెదిరించడానికి కాక ప్రజలలో సంస్కారాన్నీ, ఐక్యమత్యాన్నీ పెంపొందించాలని ప్రబోధంచే చక్కని కథ "దోపిడి-దొంగ".





వ్యాపారదృష్టి ప్రబలిన వాడు మనుషుల్లో చెల్లనిసరుకు అవుతాడు. ఈ లోపాన్ని సవరించుకో వాలిసిన అవసరం "చెల్లని సరుకు" కథలో సూచించబడింది.

కనిపించని దేవుళ్ళ కోసం ఎన్ని త్యాగాలైన చేసేవారందరు తలిదండ్రులే కనిపించే దేవళ్ళన్న విషయం విస్మరించకూడదని "కనిపించే దేవుళ్ళు" కథ హెచ్చరిస్తుంది.



ఇలా యీ సంచికలో ఎన్నో కథలు, మరెన్నో కొత్త కొత్త శీర్షికలు వున్నాయి
పదండిముందుకు....

లెక్కల తమాషాలు

చాలమంది ఏదో ఒక సంఖ్యను మనసులో అనుకోమని, ఏవేవో లెక్కలు వేసి చివరకు మనం మనసులో అనుకున్న సంఖ్యను చెప్పేస్తుంటారు. ఇప్పుడిచ్చే "లెక్కల తమాషా" కూడా అలాంటిదే. అయినప్పటికీ, ఈ తమాషా ద్వారా మనసులో అనుకున్న సంఖ్యను కాకుండా, చివరకు మిగిలే సంఖ్యను చెప్పవచ్చు. నలుగురితో ఉన్నప్పుడు ఈ "తమాషా" చేస్తే, కాలక్షేపమూ జరుగుతుంది. కావలసినంత వినోదమూ లభిస్తుంది. సరే... ఇక అసలు తమాషాలోకి వద్దాం.

మీరు నలుగురిలో కూర్చుని వున్నప్పుడు- ఒకరిని ఏదో ఒక సంఖ్యను మనసులో అనుకోమనండి. ఆ అనుకున్న సంఖ్యను రెట్టింపు చేయమనండి. ఆ రెట్టింపు సంఖ్యను మీరో పది కలుపుకోమనండి. ఇప్పుడు వచ్చిన మొత్తంలోంచి సగం తీసేయమనండి. మిగిలిన దానిలో నుంచి, మొదట అనుకున్న సంఖ్యను తీసేయమనండి... ఇక మిగిలినదెంతో మీరు టక్కున చెప్పేయవచ్చు. కాని, వెంటనే చెప్పకుండా రెండో వ్యక్తిని, మూడో వ్యక్తిని నాలుగో వ్యక్తిని కూడా మనసులో ఏదో సంఖ్య అనుకోమని పై విధంగా చేస్తూ, మీరు కలుపుకోమన్న సంఖ్యలను గుర్తుంచుకోండి. ఇప్పుడు మొదటి వ్యక్తి వద్ద మిగిలిందెంతో టక్కున చెప్పేయండి. 5 అని. అలాగే రెండు, మూడు నాలుగో వ్యక్తుల వద్ద మిగిలింది కూడా టకటకా చెప్పేయండి. వారి వద్ద మిగిలేది మీరు కలుపుకోమన్న సంఖ్యలో సగమే కాబట్టి వెంటనే చెప్పేయవచ్చు మీరు.

ఉదాహరణకు:- మొదటి వ్యక్తి 15 అనుకున్నాడనుకోండి. దాన్ని రెట్టింపు చేస్తే 30 అవుతుంది. దానికి మీరు కలుపుకోమన్న 10 కలిపితే 40 అవుతుంది. మొత్తం నలభైలోంచి సగం తీసేస్తే ఇంకా 20 మిగులుతుంది. అందులోంచి మొదటి అనుకున్న సంఖ్య 15 తీసి వేస్తే ఇక మిగిలేది 5 కదా!

అలాగే రెండు, మూడు, నాలుగో వ్యక్తుల వద్ద కూడా చివరకు మిగిలేది ఖచ్చితంగా మీరు కలుపుకోనున్న సంఖ్యలో సగమే.

"బొమ్మరిల్లు"

"క"తో గడికట్టు!

వందరూపాయిలు బహుమతి రాబట్టు!

మంది ఎక్కువైతే పది మందితో లాటరీ కొట్టు!

		1	క				
			క	2			
		3	క				
			క	4			
		5	క				
			క	6			
		7	క				
		8	క				
			క	9			
		10	క				

ఆధారాలు: 1. అన్ని అవయవాలలోకీ ముఖ్యమైంది. 2. బహుమతి 3. బి.జె.పి. గుర్తు 4. స్త్రీకంటికి అందం 5. దయ 6. కథే మరో విధంగా 7. ఎలుకదాగేది 8. దాచిన అబద్ధం 9. లొంగని వారిని పట్టేకాకా 10. ఇల్లు కట్టడానికిది ముఖ్యం.

ఈ గళ్ల నుడికట్టు పూర్తి చేసి పంపవలసిన ఆఖరి తేదీ: 20.10.98

మీ అడ్రస్: ....

మా అడ్రస్: BOMMARILLU, 80, DHANALAXMI COLONY, CHENNAI-600 026.

-ఎ.వి.ఎస్.లక్ష్మి

పిలుపు

రామయ్య, సీతమ్మ దంపతులకు లేక లేక పుట్టాడు రంగడు. వాడికి తెలివి ఉంది. ఆసక్తి ఉంది. కానీ చదవమంటే ఏపుస్తకమూ చదివేవాడు కాదు. ఎవరన్నా చదివితే, వింటే చాలుననుకునేవాడు. పదేళ్లు వచ్చినా వాడికి చదువు అబ్బలేదు.

ఒకసారి వాళ్ళింటికి రంగడి మేనమామ వచ్చాడు. ఆయన తన అక్క, బావలు దిగులుగా ఉండడం చూసి కారణమడిగి తెలుసుకున్నాడు.రంగడిని దారిలో పెట్టగలననీ సంతోషంగా ఉండమనీ వారికి చెప్పాడు.

రెండ్రోజుల్లో పుట్టిన రోజుందని రంగడు తెగ హడావుడి పడిపోతున్నాడు. ఆ విషయం తన స్నేహితులందరికీ ముందుగా చెప్పివస్తానని రంగడు బయలు దేరబోయాడు.

మేనమామ వాడినాపి, "నీ స్నేహితులకు నీ పుట్టినరోజు తెలియదా ఏం? తెలియని వారు ఇతరుల ద్వారా విని తెలుసుకోలేరా? లేక నీ యింటికొచ్చి విందు గురించి అడగరా?" అన్నాడు.

"అయితే మాత్రం నేను వెళ్ళి స్వయంగా పిలవనిదే ఎవరొస్తారు? పిలువు లేకుండా ఎవరైనా విందుకొస్తారా?" అన్నాడు రంగడు.

మేనమామ నవ్వి, "ఇంత తెలిసిన వాడివి-చదువనే పిలుపు లేకుండా సరస్వతీదేవి నీ దగ్గర కొస్తుందని ఎలా అనుకున్నావు?" అన్నాడు.

తెలివైన రంగడికి మేనమామ ఉద్దేశ్యం అర్థమయింది. ఆరోజు నుంచీ వాడు భక్తి, శ్రద్ధలతో చదవటం ప్రారంభించాడు. అదే సరస్వతీదేవికి పిలుపై వాడికి చక్కగా చదువు వచ్చి సరస్వతీ పుత్రుడని పేరు తెచ్చుకున్నాడు.




శివయ్యకు చిన్నప్పుడే తండ్రి చనిపోయాడు. తల్లి రాజమ్మ శివయ్యను ఎంతో గారాబంగా పెంచి పెద్ద చేసింది.

శివయ్య తన పొలంలో పండే కాయగూరలు, పండ్లను దగ్గరిలో ఉన్న పట్నం తీసుకుపోయి లాభసాటిగా అమ్మేవాడు. ఆ ఆదాయమే అతడి జీవనాధారం.

శివయ్యకు ఇరవైయేళ్ళు వచ్చాయి. రాజమ్మ వాడికి పెళ్ళి చేయాలని అనుకుంది. కోడలు వస్తే తనకు కూడా సాయంగా ఉంటుందని ఆమె ఆశ. పొరుగూరిలో ఉంటున్న మాదవయ్య కూతురు గౌరితో శివయ్యకు వైభవంగా పెళ్ళి జరిగింది.

గౌరి మొదట్లో అత్తని అభిమానంగానే చూసేది. కానీ శివయ్య తల్లి పట్ల ఎక్కువగా ప్రేమను కనపర్చడంవలన ఆమెలో ఈర్ష్య



తిరగబడ్డ తగవు

పుట్టింది. అది క్రమంగా పెరిగి గౌరిలో రాను రాను మార్పు చోటు చేసుకుంది. అప్పటి నుండి గౌరి అత్తకు పెట్టే కూరల్లో, చారులో,

పొడుపు కథలు

1. ఏటి మధ్య మాను ఎంత కొట్టినా తెగదు.
2. ఎవరు దిగని బావిలో భీముడు దూకుతాడు.
3. ఎల్లప్పుడూ ఒంటరిగా తిరిగేవాడు.
4. ఎలుక వచ్చి నీ పిలక పట్టుకుంది.
5. ఎముకలేని జీవం ఏటికి నీళ్ళ కొచ్చె!

పై అయిదు పొడుపు కథలకు సమాధానాలు పైపక్క యివ్వబడ్డ బొమ్మలో వున్నాయి (బొమ్మల రూపంలో). ఆల్‌కరక్టుగా జవాబు వ్రాసిపంపినవారికి వచ్చే బొమ్మరిల్లు పోస్టులో అందుతుంది.



పప్పులో కారం, ఉప్పు ఎక్కువగా వేసి వడ్డించేది. రాజమ్మ ఆ వంటలను తినలేక చాలా ఇబ్బంది పడేది. కళ్లల్లో నీర్లు తిరిగేవి.

ఒకరోజు రాజమ్మ కోడలితో వంటల్లో కారం, ఉప్పు ఎక్కువగా ఉంటున్నాయనీ కాస్త తగ్గించమనీ చెప్పింది.

గౌరి అక్కడే ఉన్న శివయ్యతో, "చూడండి మీ అమ్మ వంటలకి ఎలా వంకలు పెడుతుందో" అంది.

తనకు బాగున్న వంటలు తల్లికెందుకు నచ్చలేదో అర్థంకాక శివయ్య తికమకపడ్డాడు. అయినా తనకు వంటలు బాగున్నాయని చెబితే తల్లి నొచ్చుకుంటుందని శివయ్య ఏమీ చెప్పకుండా మౌనం వహించాడు.

కొద్దిరోజులు తరువాత మళ్ళీ రాజమ్మ వంటలు తినలేకపోతున్నానని ఏడుస్తూ శివయ్యకు చెప్పింది. శివయ్య తనకు వంటలు బాగానే ఉన్నాయనీ, అయినా తల్లి తృప్తికోసం భార్యను శిక్షిస్తాననీ అని గౌరిని కొట్టాడు. గౌరి ఏడ్చుకుంటూ వంటింట్లోకి వెళ్ళిపోయింది. శివయ్య రుసరుసలాడుతూ వీధిలోకి వెళ్ళిపోయాడు.

రాజమ్మకి బ్రతుకుపై విరక్తి కలిగింది. ఆమె చనిపోవడానికి దగ్గర్లో ఉన్న అడవిలోకి వెళ్ళింది. అక్కడ రాజమ్మకి ఒక పాడుబడిన బావి కనిపించింది. అందులో పడి చనిపోదామనుకుంది.

ఆ బావి పక్కన పెద్ద మర్రి చెట్టు ఉంది. దానిపై ఒక దెయ్యం కాపురం ఉంటోంది. అది బావిలోకి దూకబోతున్న రాజమ్మను చూసింది. ఒక్క ఊపులో రాజమ్మ ముందుకు దూకింది.

దెయ్యం రాజమ్మను, "చూస్తే వృద్ధురాలివి. ఈ వయస్సులో ఆత్మహత్య ఎందుకు చేసుకుంటున్నావు" అని అడిగింది.

రాజమ్మ జరిగినదంతా చెప్పి ఏడ్చింది.

దెయ్యం కొంచం ఆలోచించి రాజమ్మకి ఒక డబ్బా ఇచ్చింది. అందులో తెల్లటి విభూతి ఉంది.

"రాజమ్మా! వంటల్లో కారంగానీ ఉప్పుగానీ ఎక్కువైతే ఈ విభూతి చిటికెడు వేసుకో" అంది భూతం ఆమెతో.

రాజమ్మ సంతోషంగా ఆ డబ్బీని తీసుకొని దెయ్యానికి కృతజ్ఞతలు చెప్పుకొని, ఇల్లు చేరుకుంది.


మరునాడు గౌరి ఎప్పటిలాగే అత్తగారి కూరల్లో కారం, ఉప్పు ఎక్కువగా వేసి వడ్డించింది. రాజమ్మ కూరని నోట్లో పెట్టుకుంటే నోరు భగ్గుమంది.

అప్పుడు రాజమ్మకి దెయ్యం ఇచ్చిన విభూతి గుర్తుకి వచ్చింది. ఆమె చిటికెడు విభూతిని కూరల్లో వేసుకుంది. అంతే- విచిత్రంగా కూరకు అద్భుతమైన రుచి వచ్చేసింది. చాలా రోజుల తర్వాత ఆ రోజు రాజమ్మ తృప్తిగా భోజనం చేసింది.

కానీ విచిత్రంగా గౌరి కూరల్లో కారం, ఉప్పు ఎక్కువయ్యాయి. ఆమె కూర నోట్లో పెట్టుకుంటే నోరు భగ్గుమంది. ఆమెకు కూరలో కారం, ఉప్పు ఎలా ఎక్కువయ్యాయో అర్థం కాలేదు.

ఆ రోజు నుండీ గౌరి రాజమ్మ కూరల్లో ఉప్పుగాని, కారంగాని ఎక్కువ వేస్తే, దయ్యం ఇచ్చిన విభూతి మహిమ వలన గౌరి కూరల్లో ఉప్పు, కారం

మీరు ఆర్టిస్ట్ కావచ్చుగా!



పెద్ద గళ్లల్లో వేసిన బొమ్మను చిన్న గళ్లల్లో వేసిపంపండి. పంపుతూ, తమ ఫోటో (స్టాంపు సైజులో) పంపాలి. అందంగా బొమ్మగీసిన వారి ఫోటోలు వచ్చే సంచికలో ప్రచురించగలం. చిన్న బొమ్మ వేసే టప్పుడు, వేరే కాగితంపై గాకుండా, మా పేజీలో గళ్ళే, వాడాలి.
ఎడ్రస్ : మీకు తెలిసిందే!

ఎక్కువవడం జరుగుతూండేది.

కొద్దిరోజుల తరువాత గౌరికి అనుమానం వచ్చింది- తనకు తెలియకుండా అత్తగారు కూరల్లో కారం, ఉప్పు వేస్తున్నదేమోనని. వెంటనే రాజమ్మతో తగువు పెట్టుకుంది.

రాజమ్మ తనకు ఏ పాపం తెలియదని నెత్తీ నోరు కొట్టుకుంది.

అంతలో శివయ్య పట్నం నుండి వచ్చాడు.

అత్తాకోడళ్ళు తగవు తిరగబడిందని శివయ్య ఆశ్చర్యపడి జరిగిందేమిటో వివరంగా అడిగి తెలుసుకున్నాడు. రాజమ్మ చెప్పిన విభూతి విశేషం గౌరి నమ్మనంటే- ఆమె ప్రత్యక్షంగా నిదర్శనం చూపింది. అప్పుడు గౌరి సిగ్గుతో తలవంచుకుంది. శివయ్య గౌరిమీద మండిపడితే రాజమ్మే సర్ది చెప్పి శాంతపరిచింది. ఆ తర్వాత ఆ కుటుంబంలో ఏ కలతలూ లేవు. ☆



పాఠకులకు మరో ఆహ్వానం!


పాఠకులుగా, పై కథలో మీరు పొందిన అనుభూతి ఏమిటో విడమర్చి, స్పష్టంగా వ్రాసిన వారికి బహుమతి పంపగలం

బహుమతుల వివరాలు:

1. 100 రూపాయల మనియార్డరు.
2. సంవత్సరం పొడవునా, మీ ఊరి బొమ్మరిల్లు ఏజంటు, మీ యింటికి బొమ్మరిల్లు కాపీ తెచ్చి అందజేయటం.
3. ఇంటి పేరుతో సహా మీ పూర్తి పేరు, పుట్టిన తేదీ, సమయం వగైరాలతో పూర్తి వివరాలు పంపితే, ప్రసిద్ధి చెందిన న్యూమరాలజిస్ట్‌తో మీ భవిష్యత్తు గురించి వ్రాయించి పంపబడతాయి.

పై మూడింటిలో మీరు కోరిన బహుమతి అందజేయ బడుతుంది. గడువు ఈ నెల 20వ తారీఖు లోపల.

ఎడ్రస్: మామూలే!



శివపార్వతీయం

(గత సంచిక తరువాయి)

18

ఇది ఉన్మత్తం కాదు. విశ్వశక్తులను అదుపులో పెట్టుకోవటానికి అప్పుడప్పుడు మేము చేసే 'శివతాండవం!' అన్నాడు ఈశ్వరుడు.

'భళీ! ఉబుసు పోకకు వేసే యీ కుప్పిగంతలకు, పైశాచిక నృత్యానికి 'తాండవం' అని పేరా? విశ్వశక్తులను అదుపులో పెట్టుకోవటానికి యీ పిచ్చి ఒక సాధనమా? సృష్టి కార్యాన్ని నిర్వహించే బ్రహ్మ అక్కడ సరస్వతి ఒళ్ళో పడుకుని సంగీతం వినే పిచ్చిలో వున్నాడు; లయ కార్యాన్ని నిర్వహించాలిసిన నువ్వ నీ అర్ధాంగితో, ఆశ్రితులతో తైతక్కలాడుతున్నావు! త్రిమూర్తులలో యిద్దరి అసలు స్వరూపం యిదన్నమాట!" అన్నాడు భృగువు.

'భృగూ! హద్దు మీరిన ప్రసంగం ఆత్మ నాశనాన్ని తెస్తుందని మర్చిపోకు. నీ దుడుకు తనాన్ని సైరించే స్థితిలో మేం లేము. ఎందుకొచ్చావో చెప్పి, వెంటనే యిక్కణ్ణుంచి వెళ్లు. యిప్పటికే మా ఆత్మానందానికి అంతరాయం కలిగింది' అన్నాడు శివుడు.


శివుడి మాటలకు భృగువు పెద్దగా నవ్వాడు.

'ఆహా, ఆహాహా!! ఎంత చక్కగా వున్నాయయ్యా నీ మాటలు! ముందేమో విశ్వశక్తులను అదుపులో పెట్టుకోవటానికి చేసే నృత్యం అన్నావా? యిప్పుడేమో అది ఆత్మానందమంటున్నావా? ఏమిటీ పొంతన లేని మాటలు?"

'భృగూ! నువ్వు నా సహనాన్ని పరీక్షించాలనుకుంటే యిలా ప్రేలుతూ వుండు. సహనం నశించిన పరమశివుడి త్రినేత్రాగ్నిజ్వాలలకు తట్టుకోలేవు'.

'సహనం యిప్పుడేమిటి; నీలో ఎప్పుడో నశించింది. నేను వచ్చింది- నీ సహనాన్ని పరీక్షించటానికే! కాని, ఆ సందర్భం అనుకోకుండానే ఏర్పడి, విశ్వశాంతి మహాయజ్ఞ హవిర్భోక్తకు కావలసిన అర్హత నీకు లేదని తేలిపోయింది. ఇక-

కిరణ్‌కుమారి



నీ మూడో కన్నును గుర్తు చేసి నన్ను భయపెట్టాలనుకుంటున్నావా? నీకే కాదు- మూడవ కన్ను నాకు కూడా వున్నదన్న సంగతి నీకు తెలీదా? నీ మూడవ కన్ను నన్నేం చెయ్యలేదు! అభ్యాగతియై వచ్చిన తపోధనుణ్ణి అవమానించిన ఫలితాల్ని అనుభవించు. యిప్పటి నుండి నీకు భూలోకంలోనే కాక- యే లోకంలో కూడా ఆలయ మర్యాదలు- పూజా పునస్కారాలు కేవలం బోడి లింగ రూపంలోనే వుండుగాక! నిలువెత్తు ప్రతిరూపం యే ఆలయంలోనూ నోచుకోని విధంగా నీకు శాపం యిస్తున్నాను' అని ఈశ్వరుణ్ణి శపించి, భృగువు అక్కడి నుండి అంతర్థానుడయ్యాడు.

తలవని తలంపుగా అక్కడ భృగువు సాక్షాత్కరించి, మహా దేవుణ్ణి లెక్క చెయ్యకుండా ధిక్కరించి, చివరకు శాపం కూడా యిచ్చి పోయినందుకు దివ్యలోకవాసులు, కైలాసవాసులు, నివ్వెరపోయారు! పార్వతి నిశ్చేష్టితురాలైంది!!

ప్రాణాలను సృష్టించటం బ్రహ్మవంతు. వాటి మనుగడలోని అనుభవాలను, సుఖ దుఃఖాలను, ఆయుర్దాయాన్ని నిర్దేశించటం, మొదలైనవి కూడా బ్రహ్మ పనులే! బ్రహ్మకు సృష్టి కారకుడని పేరు!

బ్రహ్మ విధించిన ప్రకారం ప్రాణికోటిని నిర్ణీత సమయాల్లో లయం చేయటం యీశ్వరుడి కర్తవ్యం. ఆ కారణంవల్లనే అతడికి లయకారకుడని ప్రసిద్ధి!!

ఇక- ప్రాణుల 'స్థితి'ని సంరక్షించే బాధ్యత శ్రీమన్నారాయణుడిది. అందువల్ల ఆయన్ని 'స్థితి' కారకుడని అంటారు.

సృష్టి, స్థితి, లయల సక్రమ నిర్వహణే త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల ముఖ్య కర్తవ్యం. అటువంటి స్థితి కారకులైన శ్రీమన్నారాయణుని నివాసం వైకుంఠం.

ఆ దినం వైకుంఠంలో- శ్రీమన్నారాయణుడు తన దేవేరియైన శ్రీమహాలక్ష్మితో శేషపాన్పుపై పవళించి, వినోదంగా వున్నాడు. అప్పుడు లక్ష్మి 'ప్రభూ! మీరు శిష్ట సంరక్షణార్థం, దుష్ట శిక్షణార్థం, యిప్పటికి భూలోకంలో పది అవతారాలు ధరించారు. మీరు అవతారాలు దాల్చినప్పుడల్లా- ఒక్క రామావతారంలో తప్ప మిగిలిన అవతార సమయాల్లో మీ వియోగం భరించాను. అప్పుడు కూడా కొంతకాలం మీకు దూరంగా- లంకలో నిర్బంధితురాలినై గడిపాను. యిక దశావతారాలతో యీ అవతారాల పరంపర ముగిసినట్లేనా; యింకా యేమైనా

ంగిలివుండి, వియోగ దుఃఖంతో నన్ను
ాధింపనున్నాయా?' అని ప్రశ్నించింది.

విష్ణువు ఆమె ముఖంలోకి వింతగా చూస్తూ
దేవీ! ఉన్నట్లుండి నీ నోట యీ సమయంలో
యిటువంటి అపశకునపు మాటలు వెలువడుతున్నా
మేమిటి? అయినా- శిష్ట రక్షణకు, దుష్టశిక్షణకు
నేను కంకణం కట్టుకున్న వాడిని గనుక- మనకు
యే క్షణంలో యేకారణంవల్ల యెడబాటు కలుగు
తుందో చెప్పటం కష్టం. అన్నిటినీ సహించే స్థితిని
మనం ఏర్పరచుకోవాలి' అన్నాడు.

లక్ష్మి ముఖం విష్ణువు మాటలకు మౌనం
అయింది. 'అంటే, ఏమిటి ప్రభూ, మీ వుద్దేశ్యం?
మళ్లీ ఏదైన వంక పెట్టుకుని నన్ను విడిచి
వెళ్లాలనుకుంటున్నారా?' అంది.

విష్ణువు నవ్వి 'ఏమో, ఎవరు చెప్పగలరు? నువ్వే
నన్ను విడిచి వెళితే!' అన్నాడు. "వేళాకోలం
చాలించండి ప్రభూ! మిమ్మల్నేమిటి; నేను విడిచి
వెళ్లటమేమిటి?" అంది లక్ష్మి.

"ఇందులో వేళాకోళం లేదు. ఏ క్షణంలో ఎవరి
జీవితాలలో యెటువంటి పెనుమార్పు అయినా
కలుగవచ్చు! సృష్టి ధర్మమే అది. సృష్టి స్థితిలయాలకు
మూలకారకులమైన త్రిమూర్తులం కూడా ఆ
ధర్మానికి అతీతులం కాదు. అంతెందుకు-
అనసూయామతల్లి పాతివ్రత్యాన్ని పరీక్షించాలని
నువ్వు, సరస్వతి, పార్వతి, పట్టుబట్టి మమ్మల్ని రాచి
రంపాన పెట్టినప్పుడు నేను, బ్రహ్మ, శివుడు, ఏం
చేశాం? వెళ్లి, ఆమె తపః ప్రభావంవల్ల ముగ్గురం
పసిబాలురమై ఊయల తొట్లలో పడుకున్నాం. ఆ
తర్వాత మీరు ముగ్గురు వచ్చి పతిభిక్ష కోరితే తప్ప
మాకు విముక్తి కలుగలేదు. పంతాలు పట్టింపులు





అడవాళ్లకు ఉగ్గుపాలతో అలవడిన గుణాలు! అందువల్ల అలా అన్నాను. ఏ దుర్ముహూర్తంలోనైనా పంతాలకు పోయి, నువ్వు నాతో విభేదించి, అలిగి, నన్ను విడిచి వెళ్లే అవకాశం వుందో లేదో పై సంఘటనను బట్టి చెప్పు" అన్నాడు విష్ణువు.

"అది ఒకానొక దుష్ట సందర్భం. అన్ని లోకాల వాళ్లు అనసూయ పాతివ్రత్యాన్ని అంతగా పొగడుతూంటే, స్త్రీ సహజ చాపల్య చిత్తాల కొద్దీ మేం అలా కోరాం. ఆ తప్పుకు మేం పడ్డ మానసిక క్షోభ మరువతగ్గది కాదు గదా?" అంది లక్ష్మి.

"లక్ష్మి! ఆడవాళ్లకు పొరబాట్లు అలవాట్లు అవుతాయే తప్ప, దిద్దుబాట్లు కావు- అది శుక్రనీతి. శుక్రాచార్యుడంతటివాడి కూతురు- దేవయాని భూలోక చక్రవర్తియైన యయాతిని వివాహం చేసుకుని, కేవలం యీర్ష్య, ద్వేషం మొదలగు వాటితో అడుగడుగునా అగచాట్లుపడి, అగచాట్లు పొరబాట్లను అలవాట్లు చేసుకుని జీవితాంతం దుఃఖపడిందేగాని, సుఖపడలేదు. అప్పుడే శుక్రాచార్యుడు యీ నీతిని చెప్పాడు. అందువల్ల కోపంవల్లనో, యీర్ష్యవల్లనో, ద్వేషంవల్లనో, మరే కారణంవల్లనో నువ్వు గతంలో చేసిన పొరబాటు చెయ్యవని నిర్ధారణ యేమిటి? ఆ పొరబాటువల్ల మనకు వియోగం సంభవించినా ఆశ్చర్యపడాలిసినది లేదు".

"అబ్బబ్బా, నేనేదో ఉబుసుపోకకు అన్న మాటను పట్టుకుని ఎంత సిద్ధాంతం, రాద్ధాంతం లేవదీశారు స్వామీ! యీ ప్రసక్తి చాలించుదాం. 'వియోగం' అన్న పదం వింటూనే నాకు కంపరం కలుగుతుంది" అంటూ లక్ష్మీదేవి ఆవియోగవేదో అప్పుడే సంభవించనట్లు చలిస్తూ, పెనుగాలికి వణికే జాజి పూలత ప్రక్కన వున్న వృక్షాన్ని పెనవేసుకున్నట్లు విష్ణువు శరీరాన్ని బిగియార కౌగలించుకున్నది.

అయాచింతంగా లభించిన ఆ కౌగిలి సుఖాన్ని అనుభవిస్తూ, విష్ణువు సుఖానంద డోలికల్లో వూయెల లూగసాగాడు!!

అప్పుడు ప్రత్యక్ష్యమయ్యాడు అక్కడ భృగువు! "నమో శ్రీమన్నారాయణాయ" అన్నాడు అక్కడి దృశ్యం చూసి ముఖం ప్రక్కకు తిప్పుకుంటూ.

అనురాగ పరవశంతో ఒకర్నొకరు అల్లుకుని, బాహ్యస్థితినే మర్చిపోయినట్లున్న లక్ష్మీనారాయణులకు ఆ పిలుపు వినిపించలేదు.

"ఆహా! భోగలాలసత అన్నిచోట్లా యింత గాఢంగా


...్యాప్తి చెంది వున్నదా? త్రిమూర్తులు ముగ్గురూ తమ తమ బాధ్యతల్ని విస్మరించి, యిలా భార్యాలతో పలుకుతున్నారన్న మాట" అని వేదనపడుతూ, చిరాకు, కోపం అంతలోనే పెల్లుబికిపోగా "శ్రీహరీ!" అని బిగ్గరగా అరిచాడు. అప్పటికీ పలకరింపు కరవు కావటంతో యిక తప్పదనుకుని ముఖాన్ని లక్ష్మీ విష్ణువుల వేపు త్రిప్పి "మహావిష్ణూ! మధుసూదనా! జనార్థనా! దామోదరా! హృషీకేశా! పుండరీకాక్షా! వైకుంఠ నాయకా!..." అని ఎన్నో పేర్లతో పిలిచి, భంగపడి, పళ్లు పట పట కొరుకుతూ "లక్ష్మీ సౌందర్యలాల సమదోన్మత్తా! కామోపాస పరాయణ చిత్తా!!" అన్నాడు గొంతు చినిగిపోయేట్టు!

అప్పటికి విష్ణువు లక్ష్మి కౌగిలి విడిపించుకున్నాడు. లక్ష్మి తల్పందిగి నిల్చున్నది.

విష్ణువు చిరునవ్వుతో "భృగుమహర్షీ! ఎంత సేపైంది వచ్చి? రాకకు కారణమేమిటి?" అని అడిగాడు.

అప్పటికే భృగువు కోపంతో వూగిపోతున్నాడు. ' 'ఏమిటీ? అప్రతిహత తపశ్శక్తి సంపన్నుడనూ, అతులిత ప్రతిభా ప్రకాశితుడనూ, నిగ్రహానుగ్రహ సమర్థుణ్ణీ అయిన నన్ను యింతసేపు కుక్క కాపలా కాయించి, యిప్పుడు ఎత్తిపొడుపుగా చిరునవ్వు చిందిస్తూ, ఎప్పుడొచ్చావ్, ఎందుకొచ్చావ్, అని అడుగుతున్నావా? మీ త్రిమూర్తుల గొప్పేమిటి? బ్రహ్మకు వేదాలను రచించ గలిగిన శక్తి వుంటే, వాటికి భాష్యం చెప్పగలిగిన శక్తి నాకుంది! మీ పరమ శివుడికి ఫాలభాగంలో మూడవ కన్ను వుంటే, నాకు అరికాలిలో మూడవ కన్ను వుంది!! నీకు కాంతారక్తి వుంటే, నాకు మోక్షకాంతానురక్తి వుంది!! నా కంటె మీరు దేంట్లో గొప్ప అని యిలా విర్రవీగు





తున్నారు? నీ సహకారుల్దిద్దరికీ శృంగభంగం చేసి వచ్చాను. నన్ను అవమానించిన నిన్ను మాత్రం విడిచిపెడతాననుకున్నావా? అభ్యాగతిని నిర్లక్ష్యం చేసిన ఫలితాన్ని అనుభవించు" అని భృగువు అంతకంతకు ఆగ్రహాగ్నులు తన మనస్సును ఆవరించుకోగా పట్టిరాని కోపంతో కుడి కాలెత్తి విష్ణువు వక్షోభాగం మీద గట్టిగా తన్నాడు.

ఆ దృశాన్ని చూసిన లక్ష్మీదేవి కళ్లెర్రబడ్డాయి. నివాసమైన తన భర్త వక్షోవేదికను నీచంగా కాలితో తన్నిన భృగువును విష్ణువు తన సుదర్శనా యుధంతో హతమారుస్తాడని ఆమె భావించింది.

కాని, ఆమె తలంపుకు విరుద్ధంగా విష్ణువు లేచి కూర్చుని భృగువు పాదాన్ని రెండు చేతులతో పట్టుకుని "భృగు మునీంద్రా! విషయాసక్తుడినై మీ రాకను గుర్తించక అపరాథం చేశాను. నను మన్నించండి. అత్యంత శక్తివంతమైన జ్ఞాన నేత్రాని అరిపాదంలో యిముడ్చుకున్న మీ ముంద మేమెంత? శాంతించండి..." అని భృగువున పొగడుతూ, అతడి కోపాన్ని తగ్గించసాగాడు.

లక్ష్మీదేవికి అప్పటి శ్రీమహావిష్ణు ... జుగుప్సను కలిగించింది! భర్త మీద విపరీతమై కోపం ముప్పిరిగొంది!! అవమానాగ్నితో కు కుతలాడింది!! స్త్రీ సహజమైన అలక "అలకపాన్పు నెక్కింది.

"ఛీ- నా నివాసమైన మీ వక్షాన్ని తన్నిన వాడి దండించక పై పెచ్చు స్తోత్రపాఠాలు వల్లిస్తున్నారా యికనైనా యీ ముక్కోపి మునికి తగిన ప్రాయశ్చిత్తం చెయ్యండి" లక్ష్మి విష్ణువును చూస్తూ అంది.

కాని విష్ణువు ఆమె మాటలు వినిపించుకునే ధోరణిలో లేనందున, అసహనంగా- తీవ్రంగా ఓ మారు చూసి, లక్ష్మి అక్కడి నుంచి విసవిస అభ్యంతర గృహానికి వెళ్లిపోయింది.

విష్ణువు తన ధోరణిలోనే... "స్వామీ! ఊరక రార మహాత్ములు అన్నట్లు ఏదో ఒక ప్రయోజనాన్ని ఆశించే తమరు వచ్చి వుంటారు. అటువంటి మీక కోపం తెప్పించాను. ఆ కోపంతో నా వక్షోభాగ తన్నారు. జాతి రత్నాలతో పొదగబడిన నా కౌస్తు హారం మీ పాదానికి గ్రుచ్చుకుని ఎంత బా కలిగించిందో కదా?... కొంతసేపు మీ యీ పాదా ఒత్తనివ్వండి..." అని భృగువు కుడి పాదాన్ని మెల్లి ఒత్తుతూ, అరికాలి దగ్గరికి కుడి చేతిని తెచ్చాడ అరికాలిని ఒత్తుతూన్నట్లు నటిస్తూ, భృగు

అహంకారానికి, ఆధిక్యతకూ, హేతువైన కన్నును వ్రేళ్లతో చిదిమి వేశాడు!

బాధ భరించలేక భృగువు ఆర్తనాదం చేస్తు క్రింద కూలబడ్డాడు! విష్ణువు చిరునవ్వుతో శేషతల్పం మీద లేచి నిల్చున్నాడు.

అంతటితో భృగువు గర్వం నశించింది!

తలపైకెత్తి చూశాడు.

నారాయణుడి రూపం అప్పటికే అనంతంగా పెరిగిపోతున్నది. భృగువు ఆ రూపం అనుసరించి తల పైపైకి యెత్తుతూనే వున్నాడు.

తలవెనక్కి వంగినంత వరకు వంగి వెనక రెండు భుజాల మధ్యకు చేరే సరికి ఆగిపోయింది!


అప్పటికి విష్ణువు రూపం పెరుగుదలను కూడా ఉపసంహరించుకున్నది.

ఆ రూపంలో- అడవులు, కొండలు, నదులు, సముద్రాలు, పల్లెలు, పట్టణాలు, మనుష్యులు, రకరకాల జీవరాసులు, దేవలోక వాసులు, బ్రహ్మ రుద్రులు, సూర్యచంద్రులు,... అఖిలాండకోటి బ్రహ్మాండమే భృగువుకు దర్శనమైంది.

ప్రణవనినాదాలు, హరికీర్తనలు, గణ గణ మ్రోగుతూన్న గంటలు, పుణ్యాహవాల పవిత్ర నినాదాలు, భృగువు చెవుల్లో మారు మ్రోగసాగాయి!

భృగువు రెండు చేతులూ నుదుట చేర్చుకుని ఆ మహారూపం ముందు సాగిల పడ్డాడు.

"దేవాదిదేవా! పురాణ పురుషా!! లీలా మానుష విగ్రహా!! చరాచర జగత్తునంతా యిముడ్చుకున్న నీ విశ్వరూపాన్ని కన్నులారా సందర్శించి జన్మ తరింపజేసుకున్నాను. లక్ష్మీ నిలయమైన నీ వక్షో ప్రదేశాన్ని కాలితో తన్నిన మహాపాపిని! నన్ను కరుణించు!! త్రికాలాలలో- త్రిలోకాలలో- త్రిమూర్తు



లలో- నువ్వే అధికుడవనీ నిరూపితమైంది." అని భృగువు ప్రస్తుతించాడు. కొంతసేపటికి "భృగు మహర్షీ!" అన్న చల్లని పిలుపు వినిపించటంతో భృగువు లేచి నిల్చున్నాడు.

కట్టెదుట విశ్వరూపం లేదు. ఆ స్థానంలో శ్రీ మహావిష్ణువు నిల్చుని వున్నాడు.

"యిప్పుడు చెప్పండి. తమరు ఏకార్యార్థం యిక్కడికి దయ చేశారు?" అని అడిగాడు విష్ణువు.

"అనంతా! ఆద్యంతం సర్వ లోకాలను ఇముడ్చుకున్న నీకు నా రాకకు కారణం తెలియకుండా వుంటుందా? అయినా నా నోటితోనే చెప్పించాలని నీ అభిప్రాయమనుకుంటాను. చిత్తగించండి" అని భృగువు, నైమిశలో విశ్వశాంతి యాగం తలపెట్టినప్పటి నుంచి అప్పటి దాకా జరిగిన విశేషాలు పూస గ్రుచ్చినట్లు వివరించి "త్రిలోక సంరక్షకా! మీ వక్షం మీద కాలితో తన్నిన నన్ను శిక్షించగలిగిన శక్తి వుండి కూడా సహించి, నాకు పాదసేవ చేసిన సహనశీలివి [illegible] కనుక నా వెంట వచ్చి, విశ్వశాంతి మహాయజ్ఞంలో పాల్గొని, హవిర్భోక్తవై తిరిగి వైకుంఠానికి రావాలి. ఇదే నా రాకకు కారణం- యిది నా విన్నపం కూడా!" అన్నాడు.

"అలాగే- మనం యిప్పుడే వెళ్లి ఆ మహాయజ్ఞంలో పాల్గొందాం- పదండి" అన్నాడు విష్ణువు.

ఆ తర్వాత- ఆ యిద్దరూ సంకల్పమాత్రంతోనే అక్కణ్ణుంచి అంతర్ధానులయ్యారు!

అభ్యంతర గృహంలో అలకపాన్పు చేరిన లక్ష్మీదేవి, అవమాన దుఃఖంతో కుమిలిపోతూండగా ఓ అంతరంగిక సఖురాలు వచ్చి "తల్లీ! మీ ఆజ్ఞ ప్రకారం నేను శ్రీవారికి సమీపంలో ఓ కుడ్య శిల్పం చాటున వుండి అన్నీ గమనించాను" అని లక్ష్మి వెళ్లినప్పటి నుంచి జరిగిందంతా చెప్పింది.

ఆ మాటలు వినగానే లక్ష్మిలో కోపతాపాలు పెల్లుబికాయి! ఆవేశమూ, అవమానమూ ఆమెలో పతాక స్థాయికి చేరుకున్నాయి!! భరించరాని దుఃఖంతో పాన్పుమీద ఒరిగిపోయింది!

(ఇంకా వుంది)



అన్నదమ్ములు

ధవళగిరి రాజ్యంలో చక్రధారి అనే వైద్యుడుండేవాడు. సరైన వైద్యశాలలు లేని ఆ రాజ్యంలో ఆయనకు చుట్టుప్రక్కల మంచి పేరుంది. పేదే ప్రజానీకానికి ఆయన చేసే సేవ అమూల్యమైనది. అత్యాశ లేకుండా తన ఖర్చులకు సరిపడ్డ ధనం మాత్రమే ఆశించే ఆయన ఆస్తి పది ఆవులు మాత్రం. అవే ఆయనకు జీవనోపాధినిచ్చేవి.

చక్రధారికి నరేంద్రుడు, జయచంద్రుడు అనే కుమారులున్నారు. వారు బ్రహ్మర్షి అనే సర్వవిద్యా సంపన్నుడైన గురువువద్ద చిత్రలేఖనం, సంగీతం రాజవిద్యలు అభ్యసిస్తున్నారు.

ధవళగిరిని ధవళేంద్రుడు పాలిస్తుండేవాడు.

(కరాళ కథలు)





ఆయనకు స్వార్థమే తప్ప ప్రజల గోడుపట్టదు. రాజ్యంలో సరైన ప్రజా సౌకర్యాలు లేవు కానీ అధిక పన్నుల [illegible]లు చేసి ప్రజలను కష్టపెట్టేవాడాయన.

ఓ రోజు రాజభటులు పన్నుల వసూళ్లకు చక్రధారి దగ్గరకు వెళ్ళారు. పది ఆవులకుగానూ సంవత్సరానికి రెండు ఆవులను పన్నుగా చెల్లించాలన్నారు. ఇంకా ఇంటి పన్ను, వృత్తి పన్ను, సంతానం పన్ను అంటూ ఏవేవో లెక్కలు చెప్పారు. అంత డబ్బు తనవద్ద లేదని, చక్రధారి అంటే ఉన్న ఆవులను తోలుకునిపోతామన్నారు. ఆయన అడ్డుకున్నాడని దురుసుగా త్రోశారు.

చక్రధారి తల స్తంభానికి గుద్దుకుని బలమైన దెబ్బ తగలటంతో అక్కడికక్కడే మరణించాడు. రాజ భటులుకిమ్మనకుండా వెళ్ళిపోయారు. విషయం తెలిసి నరేంద్రుడు, జయచంద్రుడు వచ్చి, తండ్రి అంత్యక్రియలు పూర్తి చేశారు.

తండ్రి మరణం కుమారులను కృంగదీసింది. నరేంద్రుడు, "ప్రజాద్రోహియైన ధవళేంద్రుడిని హతమారుస్తాను" అంటూ ఆవేశంగా ఇల్లు వదిలి వెళ్ళిపోయాడు. అన్నను ఆపటానికి జయచంద్రుడు చేసిన ప్రయత్నం వృథా అయింది.

జయచంద్రుడు తిరిగి బ్రహ్మర్షి ఆశ్రయానికి వెళ్ళాడు. అక్కడ ఆరు మాసాలపాటు వుండి తన విద్యలకు తుదిమెరుగులు దిద్దుకుని తనంతటివాడు లేడని గుర్తింపు పొందాడు.

ధవళేంద్రుడికి దివ్యప్రియ అనే కుమార్తె ఉంది. ఆమె అద్భుత సౌందర్యరాసి. తల్లిలేని ఆమెను ప్రాణంతో సమంగా పెంచాడు ధవళేంద్రుడు. రాకుమారికి చిత్రలేఖనం, సంగీతం అంటే ప్రాణం. కూతురు అభీష్టం మేరకు రాజు ప్రతి సంవత్సరం చిత్ర లేఖనం, సంగీతంతోపాటు విలు విద్య పోటీలు కూడా ఏర్పాటు చేసి, గెలుపొందిన వారికి బహుమతులు ఇచ్చేవాడు. ప్రతి సంవత్సరంలాగే ఆ యేడు కూడా పోటీలు ఏర్పాటు చేస్తూ రాజ్యమంతటా చాటింపు వేయించాడు.

జయచంద్రుడు గురువు ఆశీస్సులు తీసుకుని పోటీలలో పాల్గొనటానికి రాజధానికి బయలుదేరాడు. ఓ రోజంతా ప్రయాణంచేసి అర్ధరాత్రివేళకు నగరం పొలిమేరల్లోకి చేరుకున్నాడు. అప్పటికి బాగా అలిసి పోయిడేమో బాటకు ఎడమవైపున కొద్దిదూరంలో ఓ ఆలయం కనిపిస్తే అందులో ఆ రాత్రికి తల దాచుకుని, ఉదయం వెళ్ళవచ్చుననుకుని అటుగా

నడిచాడు. పాడుబడిన ఆ ఆలయప్రాంగణంలో అడుగిడగానే అతడికి లోపల నుండి మాటలు వినిపించాయి. అవేమిటో వినాలనుకుని చటుక్కున గోడవారగా ఓ మూల నక్కాడు జయచంద్రుడు.

మాటలను బట్టి వారిలో ఒకడు పొరుగుదేశం గూఢచారియనీ, రెండోవాడు తన అన్న నరేంద్రుడనీ అతడికి అర్థమయింది.

ధవళగిరికి పొరుగున విజయగిరి అనే దేశ ముంది. ఆ దేశపు రాజుతో నరేంద్రుడు చేతులు కలిపాడు. అతడి పథకం ప్రకారం ఓ వీణను తయారుచేయించి గూఢచారి ద్వారా పంపాడు విజయగిరి రాజు. ఆ వీణలో బొటనవ్రేలు పరిమాణంలో రెండు విషపు బాణాలు, ఎవరికీ అనుమానంరాని విధంగా అమర్చబడి ఉన్నాయి. నరేంద్రుడు సంగీతం పోటీలలో పాల్గొంటూ. వీణ వాయిస్తూ గురిచూసి ఓ మీటను నొక్కగానే బాణాలు కంటికి అందని వేగంతో ధవళేంద్రుడి శరీరంలోకి దూసుకెళ్తాయి. రాజు మరణించి, రాజ్యం అల్లకల్లోలమై, సైనికులు, అధికారులు అజాగ్రత్తగా వున్న ఆ సమయంలో విజయగిరి సైన్యం మెరుపుదాడిచేసి రాజ్యాన్ని ఆక్రమిస్తుంది. విజయగిరి రాజు ప్రతినిధిగా ధవళగిరికి నరేంద్రుడు రాజవుతాడు.

ఆ మాటల ద్వారా జయచంద్రుడికి ఈ పథకం పూర్తిగా అర్థమయింది. అతడు మెల్లిగా అక్కడ నుండి తప్పుకుని ఆగకుండా వెంటనే నగరంలోకి వెళ్ళాడు. రాజును కలుసుకుని తన విన్నది చెప్పి హెచ్చరించాడు. రాజు వెంటనే నగరం చుట్టూ గట్టి



కాపలా ఏర్పాట్లు చేయించాడు.

మర్నాడు రాజధానీ నగరం అలంకరణలతో మెరిసిపోయింది. ప్రత్యేకంగా నిర్మించిన భవన ప్రాంగణంలో, ఘనంగా పోటీలు ప్రారంభమయ్యాయి. ధవళేంద్రుడు, దివ్య ప్రియ సింహాసనాలపై ప్రక్క ప్రక్కనే ఆసీనులై ఉండగా ముందుగా విలువిద్య పోటీలు ఏర్పాటయ్యాయి. ఐదు రోజులపాటు జరిగిన ఆ పోటీలలో జయచంద్రుడు విజేత అయ్యాడు.

తర్వాత చిత్రలేఖనం పోటీలు జరిగాయి. ఆ పోటీలలో జయచంద్రుడే ప్రథమ విజేత అయ్యాడు. జయచంద్రుడు వేసిన బొమ్మను చూసి దివ్యప్రియ పరవశించింది. అతడి ఠీవి, విలువిద్యా చిత్రలేఖనాకౌశల్యం రాకుమారిని ఆకర్షించాయి.

సంగీతం పోటీలలో కూడా జయచంద్రడు



పాల్గొంటున్నాడని తెలిసి దివ్యప్రియ మనసు ఆనందంతో నిండిపోయింది. ఒకే వ్యక్తి వివిధ రకాల పోటీలలో పాల్గొనటం అదే మొదటిసారి అందువల్ల ఆమె దృష్టిలోనేకాక ధవళేంద్రుడి దృష్టిలోనూ జయచంద్రుడు ప్రత్యేక గుర్తింపు పొందాడు. అదీగాక అతడు అప్పటికే ఆయనకు నరేంద్రుడి రాజద్రోహి పథకాన్ని గురించి చెప్పి ఉన్నాడు.

సంగీతం పోటీలకు నరేంద్రుడు కూడా వచ్చాడు. అతడు తమ్ముని కౌగలించుకుని అభినందిస్తూ, "సంగీతంలో నీతో పోటీ పడాలనుంది" అన్నాడు.

జయచంద్రుడు అన్న మాటలకు నవ్వాడు. అతడి కోరికపై మొదట నరేంద్రుడికీ, జయచంద్రుడికీ పోటీ ఏర్పాటుచేసారు. ధవళేంద్రుడు, దివ్యప్రియ ప్రక్క ప్రక్కనే సుఖాసీనులయ్యాక కొద్దిదూరంలో వున్న వేదికపైకి అన్నదమ్ములు చేరుకున్నారు. అప్పుడు జయచంద్రుడు ఏదో సైగ చేశాడు. అది చూస్తూనే వేదిక చుట్టూ వున్న రాజభటులు నరేంద్రుణ్ణి చుట్టుముట్టి బంధించారు. వీణను చేతిలోకి తీసుకుని జయచంద్రుడు అందులోని విషపు బాణాలను తీసివేశాడు. రాజభటులు నరేంద్రుడిని కారాగారంలో వేశారు.

ధవళేంద్రుడు, దివ్యప్రియ ఆసనాలు దిగి వచ్చి జయచంద్రుడిని అభినందించారు. దివ్యప్రియ మెల్లిగా జయచంద్రుడికి మాత్రమే వినిపించేలా, "ఓ వీరుడా! నిన్ను నేను ప్రేమిస్తున్నాను" అంది.

తర్వాత జరిగిన సంగీతం పోటీలలో జయచంద్రుడే విజేత అయ్యాడు. అతడి సంగీతానికి అందరూ మంత్రముగ్ధులయ్యారు.

ధవళేంద్రుడు, జయచంద్రుని ప్రతిభకు చలించి, "సర్వ విద్యా ప్రవీణుడివి. నాకు ప్రాణదాతవు. నీకు ఏం కావాలో కోరుకో! ఇస్తాను" అన్నాడు.

జయచంద్రుడు దివ్యప్రియను కోరాడు. దివ్యప్రియ అంగీకరించటంతో ధవళేంద్రుడు వారి వివాహం వైభవంగా జరిపించి, జయచంద్రుడిని రాజ్యాభిషిక్తుణ్ణి చేశాడు.

రాజయిన మరుక్షణం జయచంద్రుడు కారాగారంలో వున్న నరేంద్రుడిని విముక్తి కావించి తన సలహాదారునిగా నియమించుకున్నాడు.

కరాళుడింతవరకే కథను జెప్పి "ఓ సవిత్ర్యక మహారాజా! జయచంద్రుడి ప్రవర్తన నాకు అగమ్య గోచరంగా వుంది. ధవళేంద్రుడిని చంపి తను రాజు

కావాలనుకున్న నరేంద్రుడి పథకాన్ని విఫలంచేసి కారాగారంలో వేయించాడు. ధవళేంద్రుడి ప్రాణాలు కాపాడి రాకుమారిని కోరి రాజ్యానికి రాజయ్యాడు. రాజైన మరుక్షణం రాజ ద్రోహియైన నరేంద్రుడిని విడుదల చేసి ఉన్నత పదవిని కట్టబెట్టాడు. రాజును చంపి సింహాసనం ఎక్కాలనుకున్న నరేంద్రుడి లాంటి రాజద్రోహికి, స్వార్థపరుడికి ఆ పదవిని ఎందుకు కట్టబెట్టాడు? అది తన అన్న అనే స్వార్థంతో ఆలోచనారహితంగా అతడు చేసిన మూర్ఖపుపనా? అయితే సర్వ విద్యా ప్రవీణుడైన జయచంద్రుడు స్వార్థాన్నెందుకు జయించలేక పోయాడు? తెలిసి కూడా నా ఈ సందేహాలకు సమాధానం చెప్పక పోయావో ఈ క్షణమే నీవు నా బానిసవు" అన్నాడు.


దీనికి సవిత్ర్యుకుడిలా బదులిచ్చాడు. "ధవళేంద్రుడు సమర్థుడైన రాజు కాడు. చక్రధారి మరణం, ధవళేంద్రుడెలాంటివాడో చెప్పకనే చెబుతాయి. నరేంద్రుడు ధవళేంద్రుడిని హతమార్చాలనుకున్నాడు ఆ ఆశయంతోనే తను రాజు కావటానికి పథకం వేశాడు. అన్న బుద్ధి ఎలాంటిదో చిన్నప్పట్నించీ తెలిసిన జయచంద్రుడు ఆ మాత్రం గ్రహించగలడు. నరేంద్రుడి పథకాన్ని విఫలం చేయడంద్వారా తన అన్నను హంతకుడు కాకుండా కాపాడాడు. అన్న కారాగారం పాలయితే మాట్లాడ కుండా ఊరుకొని ధవళేంద్రుడిని తాత్కాలికంగా తృప్తి పరచాడు. ఎలాంటి కష్టనష్టాలూ లేకుండా తనే ధవళగిరికి రాజు కాగలిగాడు. తను రాజు కాగానే నరేంద్రుణ్ణి తన అంతరంగిక సలహాదారునిగా నియమించుకున్నాడు. బ్రహ్మర్షి లాంటి మహాను భావుడివద్ద శిష్యరికం చేసిన సర్వ విద్యా ప్రవీణుడు, ప్రజాక్షేమాభిలాషి అయిన నరేంద్రుడు ఆ పదవికి అన్ని విధాలా అర్హుడు. తన అన్నకాక మరెవ్వరు ఆ స్థానంలో ఉన్నా కూడా జయచంద్రుడు ఆ పనే చేసేవాడు. ఇందులో జయచంద్రుడి స్వార్థం, ఏ మాత్రం లేదు".

అది సరైన సమాధానం కావటంతో సవిత్ర్యుకుడికి ఎదురుగా వున్న కన్యపై కరాళుడి ప్రభావం నశించి ఆ యువతి ఏనుగుగా మారి అడవిలోనికి పరుగుదీసింది.

-డి.కె.చదువుల బాబు




మీరు నవ్వటం కోసం



డాక్టర్: నీ జబ్బునయంచేసి
నెల రోజులయినా ఇంకానా
ఫీజు ఇయ్యలేదు!

పేషంట్: మీరే కదండీ!
మనసుకు కష్టం
కల్గేపనులేమీ చెయ్యద్దు!
విశ్రాంతి తీసుకో అని
చెప్పారు!!




పదీ మందీ డాక్టర్లు వాడి
జబ్బుతో విసిగిపోయారా?
పాపం ఏం జబ్బో?

వాడు ఎవరికీ సరిగా బిల్లు
ఇవ్వడ్రా అదే జబ్బు!!



ఈ 'స్టీలు' గిన్నె
తీసుకోవటానికి ఒక చొక్కా
తక్కువ పడింది! మీరు
వేసుకున్న ఆ చొక్కా
తీసివ్వండి!!



ధన్వంతరి

దేవదానవులు కలిసి అమృతం కోసం క్షీరసాగరాన్ని మథించసాగారు. అలా వెయ్యి సంవత్సరాలు క్షీరసాగర మథనం జరిగేక ఒక చేతిలో కలశం, మరొక చేతిలో దండం ధరించిన దివ్య పురుషు డొకడు సముద్ర మద్యంలో ఉద్భవించాడు. అతడు మంధర పర్వతాన్ని వీపుమీద మోస్తూ- పాల సముద్రాన్ని మథిస్తున్న దేవదానవులకు సహాయ పడుతున్న కూర్మవతారుడు శ్రీ మహావిష్ణువును స్తోత్ర పాఠాలతో ముంచెత్తాడు.

విష్ణువు ప్రసన్నుడై, "నాయనా ఇక నుంచి నీవు అబ్జ అనే పేరుతో నా కుమారుడిగా ప్రసిద్ధికెక్కు తావు" అని దీవించాడు. అందుకు అబ్జ "ప్రభూ! నన్ను నువ్వు కుమారుడిగా స్వీకరించి నందుకు పట్టరాని సంతోషంగా ఉంది. నీవు యజ్ఞ పురుషుడివి. కాబట్టి నాకు కూడా యజ్ఞభాగం లభించేలా ఏర్పాట్లు చెయ్యమని కోరుతున్నాను" అన్నాడు.

అందుకు విష్ణువు, "కుమారా! ఇంద్రాది దేవతలు నీ కంటే ముందు పుట్టి యజ్ఞభాగం పొందారు. ఇప్పుడే పుట్టిన నువ్వు యజ్ఞభాగం అడగడంలో ఔచిత్యం లేదు. నువ్వు దేవతలలో ఒకడివే. సందేహం లేదు. కానీ యజ్ఞభాగం పొందాలంటే నువ్వు ఇంకో జన్మ ఎత్తవలసి ఉంటుంది. ద్వాపర యుగం వచ్చేదాకా వేచి ఉండు. పునర్జన్మలో నీవు దేవాంశ సంభూతుడవు కాబట్టి, గర్భంలో ఉండగానే అంగిమ, గరిమాది విద్యలన్నీ సాధించగలుగుతావు. లోకోపకారానికి ఆయుర్వేద గ్రంథాన్ని రచించి లోకవిఖ్యాతి పొంది మరణానంతరం దేవలోకం చేరుకుంటావు. అప్పుడు నీకు యజ్ఞభాగం లభిస్తుంది" అన్నాడు.

చూస్తూండగా ద్వాపరయుగం వచ్చింది.

అప్పుడు కాశీరాజైన దీర్ఘతపసుడు కొడుకులు పుట్టాలని తపస్సు చేయసాగాడు. అబ్జ అతడికి ప్రత్యక్షమై తానే అతడికి కుమారుడిగా పుడతానని వరమిచ్చాడు.

దీర్ఘ తపసుడి అసలు పేరు ధన్వుడు. అందుచేత అతడు తనకు జన్మించిన అబ్జకు ధన్వంతరి అని

(అపూర్వగాధలు-71)

పేరు పెట్టాడు. ఆ ధన్వంతరి దిన దిన ప్రవర్ధ మానుడై తండ్రి తరువాత కాశీ పట్టణానికి రాజయ్యాడు.

అతడు శాంతిప్రియుడు. వీతహవ్యుడనే హయ హయరాజు ఇతని మీదకు దండయాత్రకు వచ్చాడు. శాంతి ప్రియుడైన ధన్వంతరి యుద్ధం చేయడానికి ఇష్టంపడక రాజ్యం వదిలి అడవికి పారిపోయి భరద్వాజాశ్రమంలో తలదాచుకున్నాడు. భరద్వాజ ముని ధన్వంతరిని శిష్యుడిగా స్వీకరించి ఆయుర్వేద వైద్యచికిత్సా విధానం నేర్పాడు.

ధన్వంతరి ఆ వైద్య విధానాన్ని బాగా వంట పట్టించుకుని ఆయుర్వేదాన్ని ఎనిమిది భాగాలుగా విభజించి గ్రంథంగా రచించాడు. వైద్య విధానం నేర్చుకోడానికి అతడి వద్దకు శిష్యులు రాసాగారు.

ధన్వంతరి 'విషహరి' అనే మంత్రయుక్త ఔషధాన్ని తయారుచేశాడు. ఆ ఔషధం ఉపయోగించి అతడు ఎంతటి కాలనాగు కాటేసినా రోగిని రక్షించ గలిగేవాడు.

ఒకనాడు ధన్వంతరి శిష్యులతో కలిసి మూలికల కోసం కైలాసవన ప్రాంతంలో తిరుగుతున్నాడు. ఆ సమయంలో విషసర్పమైన తక్షకుడు నెత్తిమీద మణి ధరించి బుసలు కొడుతూ కశ్యపుడనే ధన్వంతరి శిష్యుడి మీదకు వచ్చాడు. కశ్యపుడు ఏ మాత్రం భయపడకుండా తక్షకుణ్ణి మంత్రంతో బంధించి అతడి నెత్తిమీద మణిని లాక్కుని నేలకేసి కొట్టాడు.

అప్పుడు తక్షకుడు మానవరూపం ధరించి, "నేను శృంగి అనే బ్రహ్మణుడిచ్చిన శాపం కారణంగా కౌరవ వంశపు రాజైన పరీక్షిత్తును కాటెయ్యడానికి వెళుతున్నాను. అందుచేత నేను నిన్ను కాటెయ్యను. నీ మంత్రశక్తికి క్షణకాలం నిశ్చేష్టుడినయ్యాను కానీ



చూడు కావాలంటే నా శక్తి" అంటూ అక్కడే ఉన్న పచ్చటి మహావృక్షాన్ని తన విషజ్వాలలతో మాడి పోయేలా చేశాడు.

కశ్యపుడు నవ్వి, "ధన్వంతరి నా గురువు. ఆయన దయవల్ల విషహరి అనే ఔషధం నా దగ్గరుంది. దాన్ని మంత్రించి వేశానంటే ఈ చెట్టు క్షణాల్లో మామూలుదవుతుంది" అంటూ మంత్రం చదివి ఆ చెట్టు బూడిద మీద ఏదో చల్లాడు. చెట్టు యథా ప్రకారం పచ్చగా కలకల లాడింది.

ఆశ్చర్యంగా చూస్తున్న తక్షకుడితో, "పరీక్షిత్తు గొప్పరాజు. దాహంతో వివేకం కోల్పోయి మౌనవ్రతంతో ఉన్న ఒక మునీశ్వరుడి మెడలో చచ్చిన పామును వేశాడు. ఆ మునీశ్వరుడే పరీక్షిత్తును తప్పు పట్టలేదు సరికదా శపించిన తన కొడుకును మందలించాడు. కాటేసి చంపాలని శపిస్తే మాత్రం నీకేం అపకారం చేశాడని పరీక్షిత్తును చంపుతావు? ఆ రాజును నా విషహరిచేత బ్రతికించి తీరుతాను" అన్నాడు కశ్యపుడు.

తక్షకుడు ఖంగుతిన్నాడు. తను పరీక్షిత్తును కాటేసింతరువాత కశ్యపుడు తిరిగి అతణ్ణి బ్రతికిస్తే నాగలోకం అంటే మనుషులకు చులకనైపోతుంది. పాములంటే భయం పూర్తిగా పోతుంది. అందుకని కశ్యపుడు పరీక్షిత్తును బ్రతికించనని మాట ఇవ్వాలని తక్షకుడు అతణ్ణి కాళ్ళా వేళ్ళా పడి బ్రతిమలాడాడు. చివరకు కశ్యపుడు పరీక్షిత్తుకు ఆయుర్దాయం చెల్లిపోయిందని గ్రహించి, తక్షకుడు కోరిన విధంగా మాట ఇచ్చాడు. తక్షకుడు వెళ్ళిపోయాడు.

తక్షకుడు ధన్వంతరి శిష్యుడి చేతిలో పొందిన పరాభవం సర్పరాజు వాసుకి చెవిలో పడింది. ఆయన ద్రోణుడనే సర్పాన్ని పిలిచి, "ద్రోణా! నువ్వు



నాయకత్వం వహించి మిన్నాగులైన పౌండ్రక, ధనంజయులతోపాటు మన నాగవీరులందరినీ తీసుకుని వెళ్ళి ధన్వంతరి శిష్యులపై మన ప్రతాపం చూపించు" అని ఆజ్ఞాపించాడు.

ద్రోణుడి నాయకత్వంలో నాగులందరూ ధన్వంతరి ఆశ్రమానికి వచ్చి విషవాయువులను చిమ్మారు. ఆ విషవాయువులను పీల్చిన ధన్వంతరి శిష్యులందరూ హాహాకారాలు చేస్తూ నేలమీద పడి మూర్ఛపోయి నురగులు కక్కసాగారు. ఈలోగా విషయం తెలుసుకున్న ధన్వంతరి క్షణం కూడా ఆలస్యం చేయకుండా విషహరి మూలికను త్వరత్వరగా ఔషధంలా పిండి శిష్యులందరూ తేరుకునేలా చేశాడు. అంతటితో ఆగక మహా కోపంతో ధన్వంతరి ప్రయోగించిన మంత్రం పాములన్నింటినీ మూర్ఛలో మునిగేటట్లు చేశాడు.

నాగజాతి అంతా మూర్ఛలో మునిగిపోయిందని విన్న వాసుకి భరించలేకపోయాడు. ఆయన ధన్వంతరి మీద ప్రతీకారం తీర్చుకోవాలని మానసా దేవిని ఆశ్రయించాడు. మానసాదేవి శివభక్తురాలు. శివుడు నాగాభరణుడు. అందుచేత స్త్రీ సర్పమైన మానసాదేవి తప్పకుండా విజయం పొందగలదని వాసుకి భావించాడు.


మానస గర్వంగా బయలుదేరి ధన్వంతరి శిష్యుల మీద విషజ్వాలలు కక్కి వాళ్ళను మూర్ఛపోగొట్టింది. ధన్వంతరి ఆమె విషజ్వాలలను విజయవంతంగా త్రిప్పి కొట్టి తన శిష్యులను కాపాడి విజయాట్టహాసం చేశాడు. అది చూసి, విషజ్వాలలతో అతణ్ణేమీ చేయలేనని గ్రహించిన మానస త్రిశూలాన్ని తీసుకుని, "నేనే శివభక్తురాలినైతే ఈ ఆయుధము ధన్వంతరిని నాశనం చేస్తుంది" అంటూ ప్రయోగించబోయింది.

అప్పుడు శివుడు, బ్రహ్మ ప్రత్యక్షమై ఆమె నాపుచేసి శాంతింపజేశారు. అంతటితో ఆ కథ ముగిసి ఎవరిళ్ళకు వారు చేరుకున్నారు.

ఆయుర్వేద గ్రంథం ఎనిమిది భాగాలు నూతన శిష్యులకు పూర్తిగా నేర్పిన ధన్వంతరి మారణానంతరం స్వర్గంచేరి, దేవతలతోపాటు అబ్జదేవుడిగా యజ్ఞభాగానికి అర్హుడయ్యాడు.

-జె.మార్కండేయులు





చెల్లని సరుకు

ఒక ఊళ్ళో సుబ్బయ్య అనే వ్యాపారి ఉన్నాడు. ఆయన ప్రతీదీ వ్యాపార దృష్టితో చూస్తాడు. స్నేహితుడు వెంకయ్యకు కూడా అలాగే ఉండమని సలహా యిస్తే, "వ్యాపారం వేరు. జీవితం వేరు. నేను మనుషుల్ని వ్యాపారపు సరుకులా చూడలేను" అనేశాడు వెంకయ్య.

వ్యాపారంలో వెంకయ్యకంటే సుబ్బయ్య బాగా పైకి వచ్చేడు. అయినా వెంకయ్య, "నాకు వచ్చే లాభంలో సంసారం సుఖంగా వెళ్ళిపోగా భవిష్యత్తు కోసం నిల్వ కూడా వేయగల్గుతున్నాను. అంతకంటే కావాల్సినదేముంది?" అని తృప్తి పడేవాడు.

అలా కొన్నేళ్ళు గడిచాయి.

సుబ్బయ్య కిద్దరు కూతుళ్ళు. పెద్ద కూతురు గిరిజ చక్కనిది. వనజ రెండోది. ఆ పిల్ల కాస్త అనాకారి కావడంవల్ల దానికి పెళ్ళెలాగవుతుందా అని బెంగ పెట్టుకున్నాడు సుబ్బయ్య.

వెంకయ్యకూ ఇద్దరు కూతుళ్ళున్నారు. పెద్దది అమల చక్కని చుక్క. రెండోది విమల. అనాకారి. సుబ్బయ్య కూతుళ్ళలాగే తన కూతుళ్ళకూ ఒక్క ఏడాదే తేడా ఉండడంవల్ల రెండు పెళ్ళిళ్ళూ కలిపి చేసేద్దామని ఆయన అనుకుంటున్నాడు. అయితే ఇలా ప్రయత్నాలు ప్రారంభించగానే అలా పెళ్ళి కుదిరింది అమలకు. విమలకు మాత్రం సంబంధం కుదరడం కష్టంగా ఉంది.

తన మిత్రుడి కూతురి పెళ్ళి కుదిరిందని తెలియగానే సుబ్బయ్య కూడా పెళ్ళి ప్రయత్నాలు మొదలుపెట్టాడు. ఆయన ఆస్తి చూసి ఆశపడేవారు చాలా మందే ఉండడంవల్ల సంబంధాలు బాగానే వచ్చాయి. అందులో తనకు నచ్చిన వరుడినొకణ్ణి ఎన్నుకుని ఆ కుటుంబాన్ని పిల్లను చూసుకోవలసిందిగా ఆహ్వానించాడు సుబ్బయ్య.

పెళ్ళివారు వచ్చారు. సుబ్బయ్య వారికి ఘనంగా మర్యాదలు చేశాడు. పెళ్ళివారు. పెళ్ళి కూతుర్ని చూడాలని తహ తహ లాడారు.

సుబ్బయ్య వారి వనజను చూపించాడు. పెళ్ళి వారికి సుబ్బయ్య ఆస్తి, హోదా అన్నీ నచ్చాయి కానీ వనజ నచ్చలేదు. పెళ్ళి కొడుక్కి సుబ్బయ్యకు అల్లుడు కావాలనుంది కానీ వనజకు భర్త

కావాలనిపించలేదు. మధ్యవర్తికీ మాట చెప్పేసరికి ఆయన సుబ్బయ్యతో, "నీ పెద్ద కూతురు గిరిజను కూడా చూపించు" అని సలహా యిచ్చాడు.

"అయ్యో! దానికి ఎప్పుడో పెళ్ళి కుదిరిపోయింది. రెండోదాని పెళ్ళి కూడా కుదిరిపోతే రెండు పెళ్ళిళ్ళు కలిపి చేయాలని నా ఆశ!" అన్నాడు సుబ్బయ్య

సుబ్బయ్యతో వియ్యమందాలన్న తహతహ కొద్దీ పెళ్ళి వారు మరి కాసిని లాంఛనా లెక్కువడిగి పెళ్ళి నిశ్చయం చేశారు.


వనజకు సంబంధం కుదిరిందని తెలిసిన వెంకయ్య సుబ్బయ్యను కలిసి, "మా విమలక్కూడా సంబంధం దొరికే మార్గం చెప్పు" అని కోరాడు.

"ఇలాంటి విషయాల్లో వ్యాపార దృష్టి ఉండాలి. మనకున్నదంతా పెళ్ళివారి ముందు ప్రదర్శించాలి. చెల్లని సరుకును ముందు చెల్లవేశాక మంచి సరుకును బేరానికి పెట్టాలి. అందుకే వనజ కోసం వచ్చిన వారితో గిరిజకు సంబంధం కుదిరిపోయిందని అబద్ధం చెప్పాను. గిరిజ కోసం వచ్చిన వారు వనజను చేసుకుంటామన్నారు. గిరిజ అందమైన పిల్ల. దానికి సంబంధం తేవడం చిటికెలమీద పని. నువ్వేమో ఊరికి ముందర అమలకు సంబంధం కుదుర్చుకున్నావు. ఆ విషయం అందరికీ తెలిసేలా చేశావు. ఇంక విమలకు చూడ్డానికెవరొస్తారు? ఇప్పటికైనా అమల సంబంధం గురించి ప్రచారం తగ్గించు. పెళ్ళివారు వచ్చేదాకా ఏ పిల్ల కోసం సంబంధమో తెలియనివ్వకు. ఆ తర్వాత విమలను చూపించి నీ వైభవాన్ని ప్రదర్శించు. కొంత ప్రయోజనముండ వచ్చు." అన్నాడు సుబ్బయ్య.

వెంకయ్య తల అడ్డంగా ఊపి, "కన్న తండ్రే చెల్లని సరుకనుకుంటే నా కూతురికి అత్తవారింట్లో విలువేముంటుంది? నా విమల బంగారు తల్లి. ఆ విషయం గ్రహించిన వరుడు దొరికే దాకా నేను ఎదురు చూడగలనులే!" అన్నాడు.

సుబ్బయ్య తన సలహాకు సిగ్గుపడ్డాడు. ఆ తర్వాత విమలకూ పెళ్ళి కుదిరింది. అత్తవారింట వనజ కంటే విమలే ఎక్కువ సుఖపడిందని వేరే చెప్పనవసరం లేదు కదా! ★





కనిపించే దేవుళ్ళు

సీతాపురంలో శివాలయానికి భద్రయ్య పూజారి. భక్తులు వేసే దక్షిణలతో, కొట్టే కొబ్బరికాయలతో అతడికి రోజులు సుఖంగా వెళ్ళిపోతున్నాయి. అయితే ఆలయానికి ప్రతిరోజూ తప్పకుండా వచ్చే శివను చూస్తే అతడికి వళ్ళు మండుతూండేది.

శివ రోజూ గుడికి వస్తాడు. శివుడికి దణ్ణం పెట్టుకుంటాడు. కానీ పూజారికి ఒక్క పైస కూడా దక్షిణగా యివ్వడు. ఓ పువ్వు కానీ, పండు కానీ దేవుడికివ్వడు. ఆలయం ముందు కూర్చున్న బిచ్చగాళ్ళకు మాత్రం చిల్లర డబ్బులు వేసి వెళ్ళిపోతాడు.

ఒకరోజున శివ ఆలయానికి వచ్చే సరికి కాస్త ఆలస్యమైంది. అప్పటికి భద్రయ్య గుడితలుపులు మూసేస్తున్నారు. "అయ్యా, పూజారిగారూ! ఒక్క క్షణం ఆగండి. స్వామికి నమస్కరించుకుని వెళ్ళిపోతాను" అన్నాడు శివ.

భద్రయ్యకు ఎన్నాళ్ళుగానో మనసులో ఉండిపోయిన అక్కసంతా అప్పుడు బయటకు వచ్చింది, "చాల్లేవయ్యా, నీ భక్తి! ఓ దక్షిణ లేదు, పండు లేదు, పువ్వు లేదు. ఎందుకీ ఉత్తుత్తి దణ్ణాలు?" అంటూ చీదరించుకున్నాడు.

శివ తెల్లబోయి, "భగవంతుడే కదా మనకన్నీ యిచ్చేది, నేనాయనకు ఏదో ఇవ్వలేదంటారేమిటి?" అన్నాడు.

"చాలా గొప్ప వేదాంతం చెప్పావులేకానీ-భగవంతుడు సర్వాంతర్యామి అని తెలుసు కదా! అలాంటప్పుడు దణ్ణం పెట్టుకునేందుకు ఇక్కడికెందుకొస్తావు?" అని వేళాకోళం చేశాడు భద్రయ్య.

"అదా? అందుకు కారణం నా దైవభక్తి. నిజాయితీ" అన్నాడు శివ తడుముకోకుండా.

"దేవుడికేమీ యివ్వకపోవడంలోంచీ దైవభక్తీ, నిజాయితీ ఎక్కణ్ణించి పుట్టుకొచ్చాయో కాస్త వివరంగా చెబుతావా, నాయనా!" హేళనగానే అన్నాడు భద్రయ్య ఆ రోజు ఆ విషయం అంతు తేల్చాలన్నట్లు.

"రోజూ శివాలయానికి వెళ్ళి శివుడికి నమస్కరించుకుంటే రోజులు సుఖంగా వెళ్ళిపోతాయని నా తల్లిదండ్రుల నమ్మకం. వాళ్ళిప్పుడు ముసలివాళ్ళైపోయారు. గుడికి వెళ్ళలేరు. నన్ను

మారోజు సులోచన

వెళ్ళమంటారు. నాకు చేతినిండా పని. క్షణం తీరుబడి ఉండదు. గుడికి వెళ్ళానని అబద్ధం చెప్పి ఇంకే పనైనా చేసుకుని రావచ్చు. కానీ నిజాయితీని నమ్ముకున్న కారణంగా అలా చేయలేదు. అర్థమయిందా?" అన్నాడు శివ.

"అయితే దేవుడికి దణ్ణం పెడితే అయిపోయిందా? తృణమో పణమో యిచ్చుకోవద్దా?" అన్నాడు భద్రయ్య.

"నా దగ్గర అంత డబ్బులేదు. అయినా నా తల్లిదండ్రులు దేవుడికి డబ్బులు వేయమని చెప్పలేదు. కాబట్టి వేయడం లేదు..." అన్నాడు శివ.

"మరి నీ దైవభక్తి మాటేమిటి?" అన్నాడు భద్రయ్య.

"నేను మానవ సేవే మాధవ సేవ అని నమ్ముతాను. నా తల్లిదండ్రులు చెప్పకుంటే నేనసలు గుడికే వచ్చి ఉండేవాణ్ణి కాదు. ఒకసారి ఇక్కడకు వచ్చేక గుడి ముందు కూర్చున్న బిచ్చగాళ్ళను చూస్తే జాలి వేస్తుంది. ఉన్నంతలో వారికి దానం చేసి వేడుతున్నాను. అదే నా దైవభక్తి!" అన్నాడు శివ.

"రోజూ వచ్చి శివలింగాన్ని చూసి దణ్ణం పెడుతూ, పైసలు మాత్రం బిచ్చగాళ్ళకు వేస్తున్నావు. నీకు వారిలోనే దేవుడు కనిపిస్తే దణ్ణం కూడా వారికే పెట్టుకోవచ్చుగా-" అన్నాడు భద్రయ్య.

"బిచ్చగాళ్ళలో నేను దేవుణ్ణి చూడను. వారి సేవలోనే భగవంతుడి పూజ ఉందనుకుంటాను. కాబట్టి నేను బిచ్చగాళ్ళకు దణ్ణం పెట్టను. ఎందుకంటే ఎటువంటి పరిస్థితుల్లోనూ కూడా దానం ఇమ్మని చేయి సాచినవాడు దణ్ణానికి అర్హుడు కాదు" అన్నాడు శివ వెంటనే.

దక్షిణ అడిగితే తన గురించీ అలాగే అంటాడని భయపడి భద్రయ్య శివను దేవుడికి దణ్ణం పెట్టుకోనిచ్చి అప్పుడు తలుపులు మూశాడు.

ఇక శివ వెళ్ళిపోతూంటే, "శివా! నీకు ఆలయంలోని దేవుడి మీద నమ్మకం లేదు. తల్లిదండ్రులు చెప్పారనే



దణ్ణం పెట్టుకుందుకు వస్తున్నావు. బిచ్చగాళ్ళని సేవించడమే దైవపూజ అంటావు కానీ వాళ్ళలోనూ దేవుణ్ణి చూడవు. మరి నీకు దేవుడేవరో తెలుసుకోవాలని నాకు కుతూహలంగా ఉంది!" అన్నాడు భద్రయ్య.

"సమస్త సృష్టికీ జన్మనిచ్చాడనే కదా, మనం దేవుణ్ణి పూజిస్తున్నాం. ఆ దేవుడెలా ఉంటాడో మన కంటికి కనిపించడు. అందుకని నాకు జన్మనిచ్చిన తలిదండ్రులే నా కంటికి కనిపించే దేవుళ్ళు" అన్నాడు శివ తడుముకోకుండా.

"రేపు నీకు పెళ్ళైతే నీకూ పిల్లలు పుట్టుకొస్తారు. నీ భార్యా నువ్వూ తలిదండ్రులవుతారు. తలిదండ్రులంటే మనలాంటి మనుష్యులే! వాళ్ళు దేవుళ్ళెలా గయ్యారో నాకు అర్థంకావడం లేదు" అన్నాడు భద్రయ్య.

"నీకు అర్థంకాదని నాకు తెలుసు. కనిపించని దేవుడికి నిత్య పూజలూ, అభిషేకాలూ చేసే నువ్వు కనిపించే దేవుళ్ళైన నీ తలిదండ్రులను ఇంట్లోంచి వెళ్ళగొట్టావంటే- నీకు దైవత్వం గురించి ఏమీ తెలియదనే కదా! ఏ తల్లిదండ్రులైనా నాకు దైవసమానులే కాబట్టి వాళ్ళను నేను చేరదీశాను. మా అమ్మా నాన్నలకు వాళ్ళు తోడుగా ఉంటున్నారు. ఉన్నంతలో అందరం కష్టసుఖాలు కలిసి అనుభవిస్తున్నాం. నీ దారి నీది. నా దారి నాది. ఎందుకొచ్చిన వాదులాట!" అంటూ అక్కణ్ణించి కదిలాడు శివ.

భద్రయ్య తెల్లబోయాడు. అతడు చటుక్కున శివ చేతులు పట్టుకుని, "నేను పూజారిని కాదు. పాపాత్ముణ్ణి. తలిదండ్రులకు నిత్యం సేవించుకునే నీవే అసలు సిసలు పూజారివి. నీకీజ్ఞానం కలిగించాలనే ఆ పరమ శివుడు నిన్ను నా దగ్గరకు పంపి ఉంటాడు. పద, మీ యింటికి వెడదాం! నా తల్లిదండ్రులను నా యింటికి తీసుకుని వెళ్ళి నీ అడుగు జాడలలో నడుస్తాను" అన్నాడు.

ఆ తర్వాత నుంచి శివ భద్రయ్యకు దక్షిణ వేయడం మొదలుపెట్టాడు. అదేమని అడిగితే, "తల్లి దండ్రులను సేవించుకునే వారికి అంతో యింతో సాయపడడమే అసలు సిసలు దైవభక్తి" అని నవ్వాడు.



మీరు నవ్వటం కోసం



తమ్ముడు: తలంటుకొని స్నానం చెయ్యడమంటే ఇలా కాదేమోరా అన్నయ్యా!!

అన్నయ్య: ఇలాగేరా తమ్ముడూ! 'భయపడకు నీ తల పూర్తిగా అంటుకొనకముందే స్నానం చేయించేస్తాగా!




ముందు మీరు దెబ్బతిన్న ప్రాంతానికి వెళ్ళి శవాలను తీసేయండి. నేను కలరా ఇంజక్షన్ చేయించుకుని హెలికాప్టర్‌లో వస్తా!!




పంతులు: చదివింపులు - చదివించేవారు చదివించవచ్చు!!

ఒక అతను: అలా అయితే ఈ నవల చదవవోయ్!!


మీరు నవ్వటం కోసం



దాన్ని చెప్పుతో కొట్టకురా...
అంటే విన్నావ్!!



బుద్ధి తక్కువై నీకు మా
చిత్రంలో శ్రీరాముడిగా-
ఆంజనేయుడిగా డబుల్
పోర్షన్ ఇచ్చాంగానీ, ఇప్పుడు
తియ్యబోయే సీను
రాముడిమీద నువ్వా కోతి
చేష్టలు మాను బాబూ!!



డైరెక్టర్: మరీ అంత గట్టిగా
పట్టక్కరలేదమ్మా... ఊరికే
పడుతున్నట్టు నటిస్తే చాలు!

హీరో: బాబోయ్

హాస్యం

గ్రామర్

సుబ్బారావు 8వ తరగతి చదువుతున్న కొడుక్కి ఇంగ్లీషు గ్రామర్ చెబుతూ-

"ఒరే రాము! డైరెక్టు స్పీచ్, ఇన్‌డైరెక్టు స్పీచ్ గురించి రెండు ఉదాహరణలు చెప్పు?" అన్నాడు.

"ఉదయం నా మీద కోపం వచ్చి నన్ను తిట్టారే అది డైరెక్టు స్పీచ్. మరేమో నిన్న రాత్రి అమ్మ మీద కోపం వచ్చి నన్నే తిట్టారే. అది ఇన్‌డైరెక్టు స్పీచ్" అన్నాడు కుమార రత్నం.

అతి బద్ధకస్తుడు

ఒక బద్ధకస్తుడి ఇంటిలో ఒక రోజు రాత్రి దొంగలుపడి దోచుకొనిపోతుండగా ఆ బద్ధకస్తుడికి మెలకువ వచ్చింది.


ఆ దొంగలను చూచిన బద్ధకస్తుడు పూర్తిగా నిద్ర లేవకుండానే "పట్టుకుపోయేవాళ్ళు పట్టుకుపోతున్నారు ఎలాగాను. ఆ సొమ్ముల లిస్టు రాసి పోలీస్ స్టేషనులో కంప్లయింట్ యిచ్చిపోండి" అని మళ్ళీ నిద్రలోకి జారాడు.

వంట సామాను

"దేవుడు దర్శనమిచ్చి మీకేం కావాలో కోరుకోండి- అంటే, ఏం కోరుకుందామండీ?" అంది భార్య మొగుడుతో.

"ఆకలి లేకుండా వరమియ్యమందాం" అన్నాడు భర్త.

"చాల్లెండి, వెధవ కోరిక. ఈ వంట సామానంతా ఏం చేసుకోవాలి?" మొగుడి నెత్తిమీద టక్కున మొట్టి, రుస రుసలాడుతూ ఇంట్లోకి పోయింది అప్సర.



ఒక దీపం వెలిగింది

ధనార్జనుడు పేరుకి తగినవాడు. డబ్బు సంపాదించడమే ధ్యేయంగా పెట్టుకుని, జీవితంలో అంతులేని సంపద గడించాడు. కానీ ముసలితనం పైబడుతున్న తరుణంలో ఎందుకోగానీ, అతనికి డబ్బుపై వున్న వ్యామోహం అంతా పోయింది.

ఒకరోజున ఒక గ్రామం పొలిమేరలో, ఒక నడివయస్కుడెవరో ఒక తాడుతో చెట్టుకొమ్మకి ఉరి వేసుకునే ప్రయత్నం చేయడం చూశాడు ధనార్జనుడు. వెంటనే ఆ వ్యక్తి దగ్గరకు నడిచి, "ఏం బాబూ, ఎందుకు చావాలనుకుంటున్నావు?" అని అడిగాడు.

"నేనొక దరిద్రుడిని. నా భార్యాబిడ్డలకు తిండి కూడా పెట్టలేను. నా చుట్టూ అప్పులు. డబ్బులేని బ్రతుకు దుర్భరం. నాకు చావు తప్ప మరో మార్గం లేదు" అన్నాడతను.

"నీ పేరేమిటి? నువ్వు ఏం పని చేస్తుండేవాడివి?" అని అడిగాడు ధనార్జునుడు.

తన పేరు కేదారి అనీ, పచారీ కొట్టు నడుపుతూ బ్రతికేవాడిననీ, ఆస్తిపాస్తులేవీ లేవనీ, ఆదాయం సరిపోక అప్పులు చేయాల్సి వచ్చిందనీ చెప్పుకొచ్చాడు అతను.

అంతా విని ధనార్జనుడు, "ఏదో ఒక పని చేస్తూ నీ కుటుంబాన్ని పోషించుకోవచ్చుగా!" అన్నాడు.

అందుకు కేదారి నిర్జీవంగా నవ్వి, "సలహాలు ఇవ్వడం సులభం. సహాయం చేయడం కష్టం" అంటూ చెట్టుకింద చేరగిలబడ్డాడు.

"నేను నీకు సహాయం చేస్తాను. నీ కుటుంబం ఒక నెలరోజులపాటు తిండికి లోటు లేని విధంగా బ్రతకడానికి సరిపోయేంత డబ్బు యిస్తాను. ఈలోగా నువ్వు ఏదైనా పని చూసుకుని, తిరిగి నీ జీవితాన్ని చక్కదిద్దుకునే వీలు కలుగుతుంది. ఏమంటావు?" అన్నాడు ధనార్జునుడు.

కేదారి లేచి నిలబడి ధనార్జనుడి చేతులు పట్టుకున్నాడు.

"మీరు ఆ సహాయం చేస్తే చాలు. మా కుటుంబం నిలబడుతుంది" అన్నాడు దీనంగా.

"కానీ ఒక్క షరతు" అన్నాడు ధనార్జునుడు.

కేదారి అయోమయంగా చూస్తూ, "ఏమిటో

కొలపల్లి ఈశ్వర్

చెప్పండి. చావబోతున్న వాడిని. మీ కోసం నా ప్రాణమైనా యిస్తాను" అన్నాడు ఆత్రంగా.

ధనార్జునుడు గంభీరంగా కేదారి ముఖంలోకి చూస్తూ, "అదేమాట నాక్కావాలి. నేను కోరినప్పుడు తిరిగి నీ ప్రాణమైనా యివ్వాలి" అన్నాడు.

కేదారి తలవంచి, "అయ్యా! ఈ రోజుకు నా భార్యా బిడ్డలు బ్రతకడమే నా కోరిక. మీ మాట మరవను. తప్పకుండా నా మాట నిలబెట్టుకుంటాను" అన్నాడు ఎంతో ఆశగా.


ధనార్జునుడు కేదారికి అన్నంత డబ్బూ యిచ్చి తన దారిన వెళ్ళాడు.

కేదారి ఎంతో సంతోషంతో ఆ డబ్బుని తీసుకొని ఇంటికి వెళ్ళాడు. జరిగిందంతా విన్న అతని భార్యా బిడ్డలు దేవుడే ధనార్జునుడి రూపంలో తమని ఆదుకొన్నాడని అన్నారు.

అప్పుడు కేదారి ముందుగా వెళ్ళి కొంత డబ్బు వెచ్చించి, తిండికి కావలసిన సరుకులు కొన్నాడు. ఆ పూట కేదారి కుటుంబం కడుపునిండా భోజనం చేశారు. తర్వాత మిగిలిన డబ్బుతో పక్క ఊరికెళ్ళి కొన్ని చిల్లర వస్తువులు తెచ్చి కొద్దిపాటి లాభంతో తన వూళ్ళో చిన్న వ్యాపారం ప్రారంభించాడు కేదారి. క్రమంగా అతని వ్యాపారం వృద్ధి చెందింది.

ఒక సంవత్సరం గడిచేలోగా తన పూర్వస్థాయికి వచ్చాడు కేదారి. ఆ తరువాత మరో రెండేళ్లలో పాత అప్పులన్నీ తీర్చేశాడు. ఆపైన ఆ చుట్టుపక్కల ఊళ్ళలోకెల్లా పెద్ద వ్యాపారస్తుడుగా మారిపోయాడు. పొలాలు, ఇళ్ళు కొన్నాడు.

ఈ విధంగా కేదారి జీవితం అనుకోని మలుపుతో ఎంతో ఉన్నత స్థాయికి చేరింది. పిల్లల పెళ్ళిళ్ళు వైభవంగా చేశాడు. ఇంటి నిండా నౌకర్లను



పెట్టుకున్నాడు. అతనికి యిప్పుడు లోటంటూ ఏదీ లేదు. అలా పది సంవత్సరాలు గడిచాయి.

ఇప్పుడు కేదారి కొత్తగా వడ్డీ వ్యాపారం మొదలుపెట్టాడు. సమయానికి అప్పు తీర్చని వాళ్ళ ఆస్తులన్నీ తీసేసుకుంటున్నాడు. అనుమాయుల మీద రవ్వంతైనా జాలి చూపకుండా వాళ్ళను పీడిస్తూ తన ఆస్తిని పెంచుకుంటూపోతున్నాడు.

ఒకరోజు సాయంకాలం వేళ, కేదారి తన భవంతిలోని విశాలమైన గదిలో, ఊయలపై పడుకుని కూని రాగం తీస్తుండగా ఎవరో అక్కడకు వచ్చి "కేదారీ!" అని పిలిచారు.

విస్మయపడుతూ చూసిన కేదారికి బాగా వయసు పైబడి సరిగ్గా నిలబడలేకపోతున్న ఓ వ్యక్తి కనిపించాడు. "ఎవరు నువ్వు?" అన్నాడు కేదారి.

"నేను ధనార్జునుణ్ణి. పదేళ్ళ క్రితం నిన్ను ఆత్మహత్య చేసుకోకుండా ఆపి ధనసాయం చేశాను. ప్రతిఫలంగా నేనెప్పుడడిగితే అప్పుడు నీ ప్రాణాలనైనా ఇస్తానన్నావు. ఇప్పుడు నా మూత్రపిండాలు దెబ్బతిన్నాయి. ఈ ప్రాంతంలోకెల్లా గొప్ప వైద్యుడు నాకు చికిత్స చేస్తున్నాడు. మరో ఆరోగ్యవంతుడి శరీరంలోని మూత్రపిండాల్లో ఒకటి తీసి, నా శరీరంలోకి మార్చగలిగితే, నేను తిరిగి కోలుకుంటానని ఆయన చెప్పాడు. అందుకే నీ దగ్గరకు వచ్చాను." అన్నాడు ఆ వ్యక్తి.

కేదారికి ఆరోజు తను యిచ్చిన మాట జ్ఞప్తికి వచ్చింది. వెంటనే రానున్న ప్రమాదం గుర్తించాడు. ప్రమాదం తప్పించుకుందుకు లేని కోపాన్ని తెచ్చి పెట్టుకుని, "నీకెంత ధైర్యం? నా ప్రాణం పణంగా పెట్టి నిన్ను బ్రతికించాలా? కావాలంటే ఆ రోజు డబ్బుకి రెట్టింపు యిస్తాను. తీసుకుని పోయావా సరే!



లేదంటే నా మనుషుల్ని పిలిచి, కుక్కల్ని తరిమినట్టు తరిమిస్తాను" అన్నాడు.

అప్పుడు ధనార్జునుడు తనపైనున్న గొంగళిని తీసి విసిరేసి, నిటారుగా నిలబడి కేదారి ముందుకువచ్చి, "ఓయి కేదారీ! నన్ను కుక్కల్ని తరిమినట్టు తరిమించేంత గొప్ప వాడివైనందుకు సంతోషంగా వుంది. ఆనాడు నిన్ను మృత్యు ముఖం నుండి తప్పించి ఈ స్థితికి తెచ్చినందుకు తగిన ప్రత్యుపకారమే అది. కానీ యిదంతా నాకు ముందే తెలుసు" అన్నాడు.

వివర్ణమైన కేదారి ముఖంలో మార్పుని గమనిస్తూ ధనార్జనుడు ఇంకా ఇలా అన్నాడు, "పిచ్చివాడా! ఈ క్షణంలో నిన్నూ, నీ ఆస్తినీ ధ్వంసం చేయించడానికి నాకు నిముషం పట్టదు. నీకంటే వెయ్యి రెట్లు ధనం నా దగ్గర వుంది. కానీ మనిషి అసలు స్వభావం, స్వరూపం ఇలా వుంటుందని తెలియజెప్పడం కోసమే ఇలా వచ్చాను. డబ్బు నీలోని అహంకారాన్ని పెంచి, నిన్ను స్వార్థ పరుడిగానూ, రాక్షసుడిగానూ చేసింది. ఆనాడు నువ్వు చచ్చి వుంటే ఈనాటి ఈ అహంకారి వుండేవాడు కాడు. మాట యిచ్చిన సంగతి గుర్తున్నా, ప్రాణం మీది ఆశ, డబ్బుపైన వ్యామోహం నిన్ను కృతఘ్నుడిగా మార్చింది. నాకు ఏ జబ్బూలేదు. నిన్ను పరీక్షించాను. నీ నిజ స్వరూపం నీకు తెలిసేలా చేశాను. కేదారీ! చావబోతున్న చెట్టుకి నీరు పోస్తే తిరిగి బలం పుంజుకుని తన జీవితాంతం ఇతరులకు నీడనూ ఫలాలను ఇస్తుంది. ఒక జ్యోతిని వెలిగిస్తే దానితో కొంపలంటించవచ్చు. లేదా ఆ జ్యోతితో వేల జ్యోతులు వెలిగించవచ్చు. నిన్ను కాపాడి ఆదుకున్నదీ అందుకే! నీలాగే దారిద్ర్యంతో కొట్టుమిట్టాడుతూ మృత్యు ముఖంలోకి వెళ్ళాలనుకొనే వాళ్ళని రక్షించి ఆదుకుంటావనుకున్నాను. ఇప్పటికైనా నా ఉపకారానికి అర్థం గ్రహించి, పరులకోసం బ్రతకడంలో ఎంత ఆనందం ఉంటుందో గ్రహించే ప్రయత్నం చెయ్యి-" అని అక్కణ్ణించి వెనక్కు మళ్ళాడు ధనార్జనుడు.

కేదారికి జ్ఞానోదయం అయింది. వెనక్కు వెళ్ళిపోతున్న ధనార్జనుడి చూస్తూ ఆయన చెప్పినట్టే బ్రతుకుతానన్న చేతులు జోడించాడు.





దోపిడి-దొంగ

రంగన్న పేరు మోసిన గజదొంగ. అతడు పేద వాళ్ళను మాత్రం దోచేవాడుకాదు. ధనవంతులను దోచుకుని ఆ డబ్బును పేదలకు పంచిపెట్టేవాడు. అందువల్ల పేదలందరూ రంగన్నను ఎంతగానో అభిమానించేవారు.

ధనికులకు మాత్రం రంగన్న సింహస్వప్న మయ్యాడు. అందుకని వారందరూ కలిసి మూక ఉమ్మడిగా రాజుకు ఫిర్యాదు చేశారు. రాజు రంగన్నను పట్టుకుందుకు ఎన్నో ప్రయత్నాలు చేశాడు. ఒక్కటీ ఫలించలేదు. చివరకో ప్రత్యేక దళాన్ని కూడా నియమించాడు. అందువల్లనూ ప్రయోజనం లేకపోయింది.

ఆ దేశంలో మోక్షానందుడనే యోగి ఉన్నాడు. ఆయన కొందరి ముందు మహిమలు చూపుతాడు. కొందరికి మంచి మాటలు చెబుతాడు. అందరికీ ఆయనంటే చెప్పలేనంత భక్తి, గౌరవం ఉన్నాయి.

రాజు రంగన్నను పట్టుకునేందుకు యోగి నాశ్రయించాడు. యోగి ఆయనకు సాయపడతానని మాట యిచ్చాడు.

రంగన్నకు యోగి అంటే చెప్పలేనంత గౌరవ మున్నది. అతడాయనకు భక్తుడు కూడా!

మోక్షానందుడు తలచుకుంటే రాజుకు తనను పట్టి యివ్వడం పెద్ద కష్టంకాదని రంగన్నకు తెలుసు. అందుకని అతడు నేరుగా యోగిని కలుసుకుందుకు వెళ్ళి తనను తాను పరిచయం చేసుకున్నాడు.

“చాలా సంతోషం. నీలో మంచి మార్పు వచ్చి నీకై నువ్వుగా లొంగిపోవడానికి వచ్చావు” అంటూ మోక్షానందుడు రంగన్నను మెచ్చుకున్నాడు.

రంగన్న తడబడి, “నేను లొంగిపోవాలని రాలేదు. నాలో మంచి మార్పు రావడంవల్లనే నేను లేనివారికి డబ్బిచ్చి ఆదుకో గల్గుతున్నాను. ఎందరికో ఆపదలు కాస్తున్నాను. నాలో తప్పేమీలేదని తమకు విన్న వించుకుందుకే తమరివద్దకు వచ్చాను” అన్నాడు.

“నాయనా! దొంగతనం చట్టరీత్యానేరం. ప్రజలు చట్టాన్ని గౌరవిస్తారు. కాబట్టి నువ్వ నేరస్థుడివి. అంతేకాదు, అంతరాత్మ దృష్టిలో కూడా దొంగతనం నేరం కాదని నువ్వనలేవు. అవునా?” అన్నాడు మోక్షానందుడు.


ఎం.వీరేశ్వరరావు


"దొంగతనం నేరమని నాకూ తెలుసు. కానీ అది నా స్వార్థం కోసం చేయడంలేదు. ఆ డబ్బులో ఇతరులకు సాయపడుతున్నాను కాబట్టి నా దొంగతనం నేరం కాదని నేను నమ్ముతున్నాను" అన్నాడు రంగన్న.

"దొంగతనం నేరమని ఒప్పుకున్నావు కాబట్టి ముందు నువ్వు నేరస్థుడివి. ఇక నీ డబ్బు ఇతరుల సాయపడడం సంగతి నిజం కాదు. ఇతరుల డబ్బుతో నీవు ఇతరులకు సాయపడాలనుకుంటున్నావు. చేతనైతే న్యాయ మార్గంలో డబ్బు సంపాదించి అది దానం చెయ్యి. అంతేకాదు, పేదలందరూ నీవిచ్చిన డబ్బును సద్వినియోగం చేస్తున్నారన్న నమ్మకమేమిటి? ఆ డబ్బు ఆయాచితంగా వచ్చిందని కొందరు వ్యసనపరులు కావచ్చు. కొందరు సోమరులు కావచ్చు. ఒక మంచి పని చేయాలంటే వ్యక్తులకంటే సంస్థలు ముఖ్యం. రాజ్యం అలాంటి సంస్థ. రాజు ఆ సంస్థకు అధిపతి" అన్నాడు మోక్షానందుడు. "స్వామీ! ధనమంతా కొందరికే చేరుతోంది. ఎక్కువ మంది ప్రజలు దోపిడీకి గురవుతున్నారు" అన్నాడు రంగన్న.

"దోపిడీని దోపిడీతో సరి చేయాలనుకుంటే ఏదో రూపంలో దోపిడీ సర్వకాల సర్వావస్థల్లోనూ నిలిచిపోతుంది. ప్రతి మనిషికీ మెదడు ఉంది. వారిలో దోపిడీ చేసేవారు కొందరే! దోపిడీకి గురయ్యే వారు అందరూ! దోపిడీకి గురవుతున్న వారందరూ ఒకచోట చేరాలి. సోమరితనాన్నీ, వ్యసనాలనూ, అవకాశవాదాలనూ విడిచిపెట్టాలి. కులాలు, మతాలు, వర్గాలు పేరిట తమలో తాము కలహించుకోవడం మాని అందరూ ఐకమత్యంగా ఉండాలి. అప్పుడే మనిషి వారిని దోపిడీ చేయలేడు. రాజు చేసే చట్టాలు ప్రజాక్షేమం కోసం. ప్రజలందరూ ఐకమత్యంతో వ్యవహరిస్తేనే ఆ చట్టాలవల్ల వారికి మేలు జరుగుతుంది" అన్నాడు మోక్షానందుడు.

రంగన్నకు జ్ఞానోదయమై ఆ రోజునుంచీ గజ దొంగతనాలు మాని ప్రజానాయకుడయ్యాడు. రంగన్నను పట్టివ్వకపోయినా అతడిలో మార్పు తేవడం ద్వారా మోక్షానందుడు రాజుకు సాయపడ్డట్లే అయింది. ఆయన తన మాటనిలబెట్టుకున్నాడు.





మనిషికి సాయం

ధర్మపురిలో ధర్మయ్య అనే ధర్మదాత ఉండేవాడు. దైవసబంధిత కార్యలంటే వెనకా ముందూ అలోచించకుండా ఎంతైనా దానమిచ్చే ఆయన బీదా బిక్కకి మాత్రం ఎంగిలి మెతుకులు కూడా విదల్చడు.

ధర్మయ్య భార్య మీనాక్షి భర్తకు పూర్తిగా. విరుద్ధం లేని వాళ్ళకు సాయపడితే భగవంతుడింకా ఎక్కువ సంతోషిస్తాడంటుందామె. ధర్మయ్య మాత్రం, "దరిద్రులకు దానమిస్తే పుణ్యం రాదు సరికదా, వాళ్ళ దరిద్రంలో కొంత మనకు అంటుకుంటుంది. దరిద్రులంటే శాపగ్రస్థులు. వాళ్ళనలా బ్రతకమని ఆ దేవుడే శాపమిచ్చాడు. మనమేం చేస్తాం?" అని భార్య మాటలు కొట్టి పారేసేవాడు.

ధర్మపురికి పది ఆమడల దూరంలో సింహపురి అనే గ్రామముంది. అది ఎన్నో నగర ప్రయాణాలకు కూడలి కావడంవల్ల ఎందరో బాటసారులు ఆ ఊరికి వస్తూ పోతూంటారు. వారికోసం వసతి గృహాలు కూడా కొన్ని వెలిసాయి. అయితే పేదబాటసారులకు మాత్రం అక్కడే సదుపాయాలూ లేక చాలా ఇబ్బంది పడేవారు. ఏ పుణ్యాత్ముడైనా ఆదరించి ఇంత అన్నంపెట్టి పడుకునేందుకు నీడనిస్తే తప్ప పేద బాటసారులకు అక్కడ గతిలేదు.

సింహపురిలో భీమన్న అనే పుణ్యాత్ముడు చాలా మంది పేద బాటసారులను ఆదరించాడు. అయితే ఆయనొక్కడివల్లా ఎంతమందికి సాయం దొరుకుతుంది? అందుకని ఆయన ఆ ఊళ్ళో ఒక ఉచిత వసతిగృహాన్ని సత్రం రూపంలో నిర్మించాలనుకున్నాడు. అందుకు తగిన ధనం పూర్తిగా తన వద్దలేనందున చందాలకు బయల్దేరాడు. ఇచ్చిన వారిచ్చారు. లేనివారు లేదు. భీమన్న మాత్రం చందాల కోసం ఊళ్ళు తిరుగుతూనే ఉన్నాడు.

అలా భీమన్న ధర్మపురి చేరుకుని ధర్మన్నను కలుసుకున్నాడు. విషయం చెప్పాడు.

అప్పుడు ధర్మన్న, "నేను దేవుణ్ణే తప్ప మనుషుల్ని నమ్మను. మనిషి మనిషిని మోసం చేస్తాడు. నీవు మోసగాడివి కాదని ఋజువేమిటి? అయినా మనిషి అవసరాలు తీర్చడానికి దేవుడున్నాడు. దేవుడి వల్ల మనిషి అవసరం తీరలేదంటే అది కూడా దైవ

వూకాటి శ్రీనివాసులు



నిర్ణయమే! ఆ నిర్ణయాన్ని కాదనడానికి నాకూ, నీకూ కూడా హక్కులేదు. కాబట్టి నా మాటవిను. నువ్వు మోసగాడివైతే ఇకమీదట మోసాలు చేయకుండా బుద్ధిగా ఉండు. నువ్వు మంచి వాడివే అయితే నీ మంచితనంతో దైవకార్యాలు చెయ్యి. మనిషికి సాయపడకు" అని భీమన్నను మందలించి పంపేశాడు.

వెళ్ళిపోతున్న భీమన్నకు దారిలో ఒక మనిషి కలిసి, "అయ్యా! నేను ధర్మన్నగారి పాలేర్ని. అయ్యగారి భార్య మీనాక్షమ్మని మహా దొడ్డమనసు. అయ్యగారు మీతో మాట్లాడిన తీరుకు ఆమె చాలా నొచ్చుకున్నది. అయ్యగారికి తెలియకుండా ఈ నూర్రూపాయలూ తమకిమ్మని పంపింది" అంటూ డబ్బిచ్చి వెళ్ళాడు.

ఒకే యింట్లో కలిసి ఉంటున్న భార్యాభర్తల మనసుల్లోని ఈ విభేదానికి ఆశ్చర్యపడుతూ భీమన్న అక్కణ్ణించి వెళ్ళాడు.

ఆ తర్వాత సుమారు సంవత్సరం గడిచేక ఒకరోజున రంగన్న అనే ఆసామీ ధర్మన్నను కలుసుకుని, "ఇక్కడకు పది ఆమడల దూరంలోని సిరిపురం గ్రామంలో శ్రీనివాసుడికి ఆలయం కట్టిస్తున్నాం. ఇంచుమించుగా ఆలయ నిర్మాణం పూర్తయింది. విగ్రహ ప్రతిష్ట ఘనంగా జరపాలని కోరిక. అందుకు ఎందరో పెద్దలు ముందుకు వచ్చారు కానీ ఒక సాధువు తమ పేరు చెప్పాడు. ఏ దైవ కార్యానికైనా వెనకాముందూ ఆలోచించకుండా సాయపడే తమలాంటి సత్పురుషులకే ఆ గౌరవం దక్కాలని ఆయన అన్నారు. అందుకే మీ వద్దకు వచ్చాను. మీరు చేయవలసిందల్లా నామమాత్రపు చందాగా వెయ్యినూటపదార్లు నాకివ్వడం, ఆ తర్వాత వచ్చే ఏకాదశికి సిరిపురం చేరుకుని తమ చేతుల మీదుగా విగ్రహ ప్రతిష్టకావించడం. ఈ విగ్రహ ప్రతిష్ట చేసే అవకాశానికి లక్షలిస్తామని ఎందరో ముందుకొచ్చారు. అయినా మాకు మనిషి విలువే ఎక్కువ. డబ్బు ముఖ్యంకాదు" అని చెప్పాడు.

ఇది విని ధర్మన్న ఎంతో పొంగిపోయాడు. ఈలోగా మీనాక్షి ఆయన్ను లోపలకు పిలిచి, "నాకా మనిషి మోసగాడిలా కనబడుతున్నాడు. డబ్బు విగ్రహ ప్రతిష్ట సమయంలోనే ఇస్తానని చెప్పు. నీ మీద నిజంగా గౌరవముంటే ఒప్పుకుంటాడు" అని హెచ్చరించింది.

ఇందుకు ధర్మన్న, "దైవకార్యానికి వచ్చిన వాడిని

అనుమానించమంటావా?" అని భార్యమీద విరుచుకు పడ్డాడు. ఆయన రంగన్నకు వెయ్యిన్నూట పదార్లివ్వడమేకాక అదనంగా మరో వెయ్యి కూడా ఇచ్చి పంపాడు.

ఆ రోజు త్రయోదశి. ఆ తర్వాత పన్నెండు రోజులకు ధర్మన్న భార్యా సమేతంగా సిరిపురానికి వెళ్ళాడు. తీరా చూస్తే అక్కడ ఏ సందడీలేదు. పురాతనకాలపు శ్రీనివాసుడి ఆలయం మాత్రం ఒకటున్నది. రోజంతా ఊరంతా తిరిగి రంగన్న కోసం వాకబు చేశాక తను పూర్తిగా మోసపోయానని ధర్మన్నకు అర్థమైంది.

"దేవుడిపేరు చెప్పి కూడా మోసాలు జరుగుతున్నాయన్నమాట!" అని ధర్మన్న ఎంతో నొచ్చుకున్నాడు. అయితే అప్పటికే చీకటి పడిపోవడంవల్ల తిరుగు ప్రయాణం చెయ్యలేక ఆ రాత్రికి అక్కడే ఉండిపోవాలనుకున్నాడు.


"ఎవరికైనా సాయమడుగుదాం. తల దాచుకుందుకు నీడ నిచ్చే పుణ్యాత్ములెవరో ఒకరుండకపోరు" అంది మీనాక్షి.

అయితే ధర్మన్నకు అభిమానం అడ్డొచ్చింది. తను మనుషుల్ని నమ్మడు. తననిప్పుడు ఎవరైనా అనుమానిస్తే ఎంత అవమానం?

"అందరూ నీకులా ఉండరు. నీకు సిగ్గనిపిస్తే నేనెవరినైనా అడుగుతాను" అన్నది మీనాక్షి వెంటనే.

"వద్దు. నాకు మనిషి సాయం అక్కర్లేదు. ఆ దేవుడే నాకు సాయపడుతాడు. ఈ రాత్రికి దేవాలయంలో తల దాచుకుందాం" అన్నాడు ధర్మన్న.

భార్యభర్తలిద్దరూ దేవాలయం చేరుకునే



సమయానికి పూజారి గుడి తలుపులు మూసి తాళం వేస్తున్నాడు. ఆయన ధర్మన్న కథ విని, "అయ్యా, తమరు పెద్ద మనుషుల్లా ఉన్నారు. అంత మాత్రాన వేషయం చూసి మోసపోలేము కదా! శ్రీనివాసుడి ఆభరణాలు కాజేయాలని ఎందరో రకరకాల వేషాలు వేసుకుని వస్తున్నారు. గుడిలోకి అపరిచితులను ఉండనివ్వడంలేదు" అన్నాడు.

తన వంటి వాడిమీద ఇలాంటి నింద పడనున్నందుకు ధర్మన్న చిన్న బుచ్చుకుని, "పోనీ, ఆలయం వెలుపల ధ్వజస్థంభం పక్కన ఉన్న మంటపంలో ఈ రాత్రికి ఉండవచ్చా?" అన్నాడు.

పూజారి ఆయన వంక జాలిగా చూసి, "ఈ ఊళ్ళో ఎందరో పుణ్యాత్ములున్నారు. ఎవరింటికో వెళ్ళక ఈ ఆలయంలోనే ఉంటాననడం మీపై అనుమానాన్ని

పెంచుతున్నది. అయినా మంటపంలో ఉంటానంటే కాదనడానికి నేనెవర్ని? ఎటొచ్చీ అర్ధరాత్రి కాగానే ఇక్కడకు జూదరులూ, తాగుబోతులూ చేరతారు. వాళ్ళు అల్లరి చేస్తారు. మీవంటివాళ్ళను అల్లరి పెడతారు. ఆ పైన మీ యిష్టం" అన్నాడు.

"మనిషి సాయం పొందడం ఇష్టంలేక దేవాలయానికి వచ్చాను. నాకు దేవుడి సాయమూ దొరకలేదు. ఇప్పుడేది దారి?" అన్నాడు ధర్మన్న.

పూజారికి ధర్మన్న పరిస్థితి అర్థమైనట్లుంది, "అయ్యా తమ వద్ద డబ్బున్నట్లయితే ఈ ఊరినానుకునే సింహపురి ఉన్నది. అక్కడ వసతి గృహాలున్నవి" అన్నాడు.


అప్పుడు ధర్మన్న జేబులు తడుముకోగా డబ్బు సంచీ కనబడలేదు. ఎక్కడో పడిపోయినట్లుంది.

పూజారి ఆయన వంక అనుమానంగా చూసి, "మీరు మోసగాళ్ళైతేమీ కర్మ మీదనుకుని ఒక ఉపాయం చెబుతున్నాను. సింహపురిలో భీమన్న అనే పుణ్యాత్ముడు నెలకొల్పిన ఉచిత వసతి గృహమున్నది. ఇప్పుడే బయల్దేరితే చిటికెలో అక్కడకు చేరుకుంటారు" అన్నాడు.

చేసేది లేక భార్యాభర్తలిద్దరూ సింహపురి వెళ్ళి అక్కడి ఉచిత వసతి గృహంలో బస చేశారు. భీమన్న ఆ సత్రాన్ని నడుపుతున్న తీరు చూశాక ఎంతో సంతోషించి "మన డబ్బు పోవడం మంచిదే అయింది. దైవ కార్యాలే గొప్పవని, మనిషికి సాయపడడం అల్పత్వమనీ అనుకునే నా భ్రమ వదిలిపోయింది. దేవుడు నా కళ్ళు తెరిపించాడు" అన్నాడు. అప్పుడు మీనాక్షి తమ డబ్బు పోలేదనీ, అది భర్త తనకిచ్చి మరిచాడనీ, ఆయనకు భీమన్న సత్రం గురించి తెలియాలనే వెంటనే ఆ విషయం చెప్పలేదనీ అన్నది.

ధర్మన్న అపరిమితానందంతో, "అయితే ఆ డబ్బు నాది కాదు. ఈ సత్రం నిర్వహణకు దాన్ని విరాళంగా యిచ్చి మనిషికి సాయపడే భీమన్నకు సాయపడి గతంలో నేను చేసిన తప్పును సవరించుకుంటాను" అన్నాడు.

భర్తలో వచ్చిన ఈ మంచి మార్పుకు మీనాక్షి ఎంతో సంతోషించింది.





దేవేంద్రునికి లేఖ

ఓఢ్ర దేశంలోని కటక్‌పురికి పూర్వం ఖురదారత పురం, బాకబాటికోట అనే పేర్లుండేవి. ఒకానొకప్పుడు వీరకృష్ణదేవ గజపతి ఆ నగరాన్ని పాలించాడు. ఆయనకు మన్మహా ఠాకూర్, వరప్రసాద, కోటి సూర్యప్రకాశ, దేవ నరసింహ గజపతి మహారాజేశ్వర వగైరా బిరుదులుండేవి. ఆ రాజుకు వేపకాయంత చిన్న తోక ఉండడంవల్ల ఆయన లాంగూడ గజపతిగా కూడా ప్రసిద్ధికెక్కాడు.

సింహాద్రిపై వరాహన్న సింహస్వామిని ప్రతిష్ఠించి, అక్కడ దేవాలయ నిర్మాణం కావించి మహోత్సవాలు జరిపించి- ఆ ప్రదేశానికి ప్రఖ్యాతం చేసిన ఘనత ఈ లాంగూడ గజపతిదే! ఆయన తన భుజబలంతో ఆంధ్ర, కళింగాది దేశములను కూడ పరిపాలించి సార్వభౌముడనిపించుకున్నాడు.

లాంగూడ గజపతి అనంతరం కపిలేశ్వర గజపతి సింహాసనాన్నధిష్ఠించాడు. ఆయన పరిపాలనా కాలంలో ఒకసారి- ఏడాదిపాటు వానలు పడలేదు. దేశంలో దుర్భిక్షం ఏర్పడింది.

ఆ మరుసటి సంవత్సరం వానాకాలంలో కూడా ఎక్కడా వర్షం కురిసే ఛాయాలు లేకపోయేసరికి రాజు కలవరపడి ప్రధానమంత్రిని పిలిచి సంజాయిషీ అడిగాడు.

ఏం చెప్పాలో తెలియని ప్రధాని, "ప్రభూ! వర్షాధిపతి ఇంద్రుడు. భూమ్మీద వానలు కురిపించే బాధ్యత ఆయనది. మనదేశంలో వానలు పడకపోతే సంజాయిషీ ఇవ్వగలిగింది ఆయన మాత్రమే!" అని తప్పించుకో చూశాడు.

రాజేమైనా తక్కువ తిన్నాడా? ఆయన వెంటనే, ' 'మన దేశంలో వెంటనే వానలు కురిపించవలసిందని నేను కోరుతున్నట్లుగా ఒక సందేశాన్ని ఇంద్రునికి పంపించు" అని మంత్రికి చెప్పాడు.

ఏం చేయాలో ప్రధానికి పాలు పోలేదు. రాజు మాట కాదంటే శిక్ష తప్పదు. కానీ ఆయన ఆజ్ఞను పాలించడమెలాగో తెలియదు.

ఆ కాలంలో హర్కారులనే వార్తాహరులుండేవారు. ప్రధాని వెంటనే వారికి కబురుపెట్టి రప్పించి మహారాజు ఆజ్ఞను చెప్పాడు.

"అయ్యా! ఇది అన్యాయం. భూలోకంలో ఎక్కడికి

(గజపతి రాజుల కథలు)

వెళ్ళమన్నా వెళ్ళగలం. ఎవరిని కలవమన్నా కలవగలం. మాకు తెలియని దేవలోకానికి మేమెలా వెళ్ళగలం, దేవేంద్రుడినెలా కలవగలం?" అన్నారు హర్కారులు.


ప్రధాని వారికి మహారాజు ఆజ్ఞాపత్రాన్నందజేసి, "నా బాధ్యత నేను నిర్వర్తించాను. ఈ పత్రాన్ని దేవేంద్రుడికి చేరవేయడం మీ బాధ్యత. అదెలా నిర్వహిస్తారో మీరే నిర్ణయించుకోండి. రాజాజ్ఞ తిరుగులేనిది" అన్నాడు.

హర్కారులు ప్రధానినెంత వేడుకున్నా ఆయన తను చేయగలిగినదేమీ లేదని నిక్కచ్చిగా చెప్పేశాడు. చివరకు హర్కారులు ఆజ్ఞాపత్రాన్ని స్వీకరించక తప్పలేదు.

అప్పుడు వారు ప్రధానినడిగి దారి ఖర్చులకుగానూ నూట ఏభై వరహాలడిగి తీసుకుని తమ తమ యిళ్ళకు వెళ్ళి విషయం చెప్పి, "కొంతకాలంపాటు మేము మిమ్మల్ని వదిలి మరెక్కడైనా తలదాచుకుని రాగలం. అంతవరకూ మీరు ఎలాగో రోజులు గడపండి" అని తమ వారికి చెప్పారు.

హర్కారుల భార్యాబిడ్డలు వెంటనే, "తొందరలో మీరు తిరిగి రాకపోతే రాజు మీ స్థానంలో మమ్మల్ని శిక్షిస్తాడు. మీరు నగరం విడిచి వెళ్ళేమాటైతే మేమూ మీతోనే వచ్చేస్తాం. ఎక్కడో ఒకచోట కలోగంజో త్రాగుతూ కలిసి బ్రతుకుదాం" అన్నారు.

అంత మందీ కలిసి ఒక్కసారి నగరం విడిచి షేడితే రాజుకు అనుమానం కలుగుతుంది. అందు కని పారిపోవడం శ్రేయస్కరం కాదని హర్కారులు భావించారు. మరే ఉపాయమూ తోచక తమవద్ద



నున్న ధనంతో పురుషోత్తమపురానికి వెళ్ళారు. అక్కడ జగన్నాథస్వామి ఆలయముంది. శ్రీ జగన్నాథుడి మహిమలు, లీలలు జగద్విదితాలు.

హర్కారులు శ్రీ జగన్నాథుడి ఆలయానికి వెళ్ళారు. అర్చకులకు తెలియకుండా గర్భగుడిలో ప్రవేశించారు. గుడి తలుపులు మూసేదాకా ఒక మూలకు నక్కి దాక్కున్నారు. తర్వాత ఆజ్ఞాపత్రాన్ని శ్రీ జగన్నాథుని పాదాల ముందుంచి "లీలా మానుష విగ్రహుడివి. నీకు మా సమస్య పూర్తిగా తెలుసు. నువ్వే మమ్మల్ని రక్షించగలవు." అంటూ విగ్రహం ముందు సాష్టాంగపడిపోయారు.

అంతలోనే హర్కారులకు మైకం కమ్మింధి. వారు గాఢనిద్రలో పడిపోయారు. ఆ నిద్రలో వారందరికీ ఒకే రకమైన కల వచ్చింది. ఆ కలలో జగన్నాథుడు కనిపించి, "మీరు భయపడకండి. నేను మీ లేఖను దేవేంద్రునికి చేర వేస్తున్నాను. ఆయన జవాబు మీకందజేస్తాను. అది తీసుకుని నిర్భయంగా తిరిగి వెళ్ళి మీ రాజును దర్శించుకోండి" అన్నాడు.

తెల్లవారుఝామున హర్కారులందరికీ ఒక్కమారుగా మెలకువ వచ్చింది. వాళ్ళు తమలో తాము చర్చించుకుని అందరికీ ఒకే కల వచ్చినట్లు గ్రహించి శ్రీ జగన్నాథుడి పాదాల వంక చూశారు.

ఆశ్చర్యం!

అక్కడ తాముంచిన ఆజ్ఞాపత్రం స్థానంలో మరో కొత్త సందేశ పత్రమున్నది. దానిపై దేవేంద్రుని మొహరున్నది. చూడగానే ఆ సందేశపత్రం దివ్యమైనదనిపించేలా ఉన్నది.

హర్కారులా సందేశ పత్రం తీసుకుని జగన్నాథుని



పాదాలకు మరోసారి నమస్కరించి అక్కణ్ణించి బయటపడ్డారు.

పురుషోత్తమపురం నుంచి కటక్ పురికి వెళ్ళి ముందుగా ప్రధానిని కలుసుకుని జరిగింది చెప్పారు హర్కారులు. అదంతా ప్రధానికి నమ్మబుద్ధికాలేదు కానీ వారందించిన సందేశపత్రం చూడగానే అటువంటిది మానవ మాత్రులు తయారు చెయ్యలేరనిపించింది. ఏది ఏమైనా ప్రస్తుతానికి గండం గడిచింది కదా అని సంతోషించి ప్రధాని ఆ పత్రాన్ని రాజు కందజేశాడు.

కపిలేశ్వర గజపతి మహారాజు ఆ పత్రాన్నందుకుని విప్పి చదివితే, "మావల్ల మీ దేశంలో కలిగిన అసౌర్యానికి చింతిస్తున్నాను. శ్రీ జగన్నాథుని ఆదేశాన్ని మన్నించి మీ దేశంలో వానలు పడేందుకు ఏర్పాటు చేస్తున్నాను. అందుకు మాకు మూడు రోజులు గడువు కావాలి. ఇట్లు -దేవేంద్రుడు" అని దేవలిపిలో వ్రాసి ఉంది.


మహారాజు బ్రహ్మానందపడి ఆ సందేశాన్ని తెచ్చిన హర్కారులను పిలిపించమన్నాడు. వాళ్ళు వచ్చేక, "మీ ప్రభుభక్తి, కార్యదీక్ష ఎంతో గొప్పవి. మీరు సాధించుకుని వచ్చిన కార్యం సామాన్యమైనది కాదు. మూడురోజుల్లో మన దేశంలో వర్షాలు కనుక పడితే మిమ్మల్ని నేను తగిన విధంగా సత్కరించగలను" అని చెప్పాడు.


ఇంకా హర్కారులకిదంతా కలో, నిజమో తెలియలేదు. మూడు రోజులు గడిచేదాకా వారు జెంగగానే ఉన్నారు. అప్పుడు దేశంలో భారీ ఎత్తున వానలు పడడంతో అక్కడి భూమితోపాటు వారి మనసులూ చల్లబడ్డాయి.

అన్నమాట ప్రకారం మహారాజు హర్కారులకు ఘనంగా సత్కరించాడు.

ఈ కపిలేశ్వర గజపతి మహారాజు తన పేరు మీద ఆంధ్రదేశంలో వశిష్ఠ గోదావరీ తీరాన కపిలేశ్వర పురము అనే బ్రాహ్మణ అగ్రహారమును నిర్మించి ఉన్నాడు. ఊరు ఇప్పటికీ ఉంది.

మనస్ఫూర్తిగా ప్రజాక్షేమాన్ని కోరే రాజు మూర్ఖంగా ప్రవర్తించినా భగవత్కృప ఆయన కుండగలదని ఈ కథ చెప్పకనే చెబుతుంది. - భమిడిపాటి వెంకటరమణ





ప్రళయబంధం

(కోతిగా మారిన ద్వితీయుణ్ణి ఓడ కప్తాను ఆదరించాడు. కవిత్వం వ్రాస్తున్నదని ఆ కోతిని ఒకదేశపు రాజు ముచ్చటపడి కొన్నాడు. ఆ రాజు కూతురు ద్వితీయుడు మనిషేనని ఊహించి తన మంత్రశక్తితో అతణ్ణి మళ్ళీ మనిషిని చేసింది. అప్పుడే ద్వితీయుడి కన్ను పోయింది. రాజ కుమార్తె మరణించిందని రాజు ద్వితీయుణ్ణి మరెక్కడికైనా పొమ్మన్నాడు. ఆ తర్వాత...)

13

ద్వితీయుడి కథ అక్కకు నచ్చింది. ఆమె వాడికి స్వేచ్ఛనిచ్చింది కానీ, వాడు తృతీయుడి కథ విని గానీ అక్కణ్ణించి కదలనన్నాడు.

అప్పుడు తృతీయుడు తన కథను చెప్పాడు.

అతడు కాసిబ్ అనే రాజు కొడుకు. తండ్రి చనిపోగానే రాజై కొంత కాలం చక్కగా రాజ్యపాలన చేశాడు. అయితే అతడికి సముద్రయానమంటే ప్రాణం. అతడి రాజ్యం సముద్ర తీరాన ఉన్నది. ఆ సముద్రంలో ఎన్నో ద్వీపాలు తేలుతూ ఉన్నాయి. అన్నిటికీ తృతీయుడే అధిపతి.

ఒకసారి తృతీయుడికి ఆ ద్వీపాలన్నీ చూసి రావాలనిపించింది. అందుకు పది ఓడలు సిద్ధం చేయించాడు. వాటిని ఆహార సామాగ్రులతో నింపాడు. ప్రయాణమయ్యాడు. అలా ఇరవై రోజులు సాఫీగా గడిచిపోయాయి.

ఒకరోజున ఉన్నట్లుండి గాలి ఉధృతంగా వీచింది. కెరటాలు ఉవ్వెత్తున లేచాయి. అది రాత్రి సమయం బయట ఏం జరుగుతోందో తెలియలేదు. తెల్లారేసరికి ఓడలు ఓ చిన్నద్వీపం చేరుకున్నాయి. అప్పటికి ప్రకృతి ప్రశాంతం కావటంతో రాజు, బృందం అక్కడ బస చేసి రెండ్రోజులున్నారు. సుఖంగా తిని కాలం గడిపారు.

తృతీయుడి బృందం మళ్ళీ ప్రయాణం ప్రారంభించేక మరో ఇరవై రోజుల్లో తమ నౌకలు దారి తప్పాయని తెలుసుకున్నారు. ఓడ కప్తానుకు కూడా తామెక్కడున్నదీ ఎటుపోతున్నదీ తెలియక

అనుసరణ : మనోహర్



ఓ మనిషిని తెరచావ కొయ్యి పైకి ఎక్కి చూడమన్నాడు. వాడలా చూసి దిగి వచ్చి, దూరాన చేపలీదుతున్నాయనీ ఒక పెద్ద చేప అటూ ఇటూ కదులుతున్నదనీ అది ఒకవైపు నల్లగానూ, మరొకవైపు తెల్లగానూ ఉన్నదనీ చెప్పాడు.

ఆ మాట వింటూనే కప్తాను పిడుగు మీద పడ్డట్లుగా చలించిపోయాడు. అతడు తన తలపాగా నేలకేసి కొట్టి జుత్తు పీక్కుంటూ, "మనందరికీ చావు మూడింది" అంటూ ఏడ్వసాగాడు. అది చూసి అక్కడున్న వారందరూ ఏడ్పులు మొదలుపెట్టారు. అప్పుడు తృతీయుడు కలగజేసుకుని ఏం జరిగిందో చెప్పమన్నాడు.

"తెలుపు నలుపుల చేప కళ్ళ బడిందంటే మనం అయస్కాంత పర్వతానికి చేరువలో ఉన్నామని అర్థం. మరి కాస్త దగ్గరవగానే మన ఓడకు కొట్టిన మేకులు, పటకాలు అన్నీ విడిపోయి ఆ కొండకు అతుక్కు పోతాయి. ఓడ ముక్కలు ముక్కలుగా విడిపోతుంది. ఈ విధంగా ఆ కొండకు ఎంత ఇనుము చేరిందో అల్లాకే ఎరుక. ఆ కొండ శిఖరంపై పది స్తంభాలపై నిలబెట్టబడి ఒక ఇత్తడి గుమ్మట మున్నది. దానిపైన ఒక ఇత్తడి గుఱ్ఱం. దానిమీద ఒక బొమ్మరౌతు. అతడి చేతిలో ఇత్తడి బల్లెం. అతడి ఛాతీకి మంత్రాక్షరాలు వ్రాయబడ్డ సీసపు కవచం. ఆ రౌతు ఆ గుఱ్ఱంమీద ఉన్నంతకాలం ఇటుగా వచ్చే ఓడలు ముక్కలు ముక్కలై వాటిలోని జనం నీటిలో మునిగిపోవలసిందే! ఆ రౌతును గుఱ్ఱం మీంచి పడగొట్టేదాకా మనెవ్వరికీ రక్షణ లేదు. ఇప్పుడు దారి మళ్ళించడానికి కూడా గాలి మనకు అనుకూలంగా లేదు" అని చెప్పి కప్తాను మళ్ళీ ఏడ్వసాగాడు.

అప్పుడు ఓడలోని వారందరూ ప్రాణాలమీద ఆశలు వదులుకుని ఒకరికొకరు వీడ్కోళ్ళు చెప్పుకొని దుఃఖ పడ్డారు. కొంతసేపటికి నల్లని అయస్కాంత పర్వతం వారికి దగ్గరైంది. అంతా కప్తాను చెప్పినట్లే జరిగింది. ఓడ ముక్కలైంది. ఒకటి కాదు, రెండు కాదు మొత్తం పది ఓడల జనం నీటిపాలయ్యారు. ప్రచండ వాయువులు, ఉవ్వెత్తున లేచే కెరటాలు ఆ జనాన్ని తలో దారికీ పంపాయి. వారిలో ఎందరు చచ్చారో ఎందరు బ్రతికారో ఎవరికీ తెలియదు. తృతీయుడికి మాత్రం ఓ కొయ్యపలక చేతికి చిక్కింది. అతడు దానిని బలంగా పట్టుకుని విడువలేదు. అతడు ఆ విధంగా అయస్కాంత

పర్వతం చేరుకున్నాడు. ఆ రాతి పర్వతంలో పైకెక్కడానికి అతడికి మెట్లు కనిపించాయి. తృతీయుడు తన ప్రాణాలు దక్కినందుకు అల్లాను తలచుకుని ప్రార్థించాడు.

కథ ఇంత వరకూ వచ్చే సరికి తెల్లవారుతోంది. షారాజాద్ అప్పటికి మౌనం వహించి రాత్రి కాగానే తిరిగి ఎప్పటిలా కథను చెప్పసాగింది.

పదిహేనవ రాత్రి కథ:

తృతీయుడు అక్కకూ తదితరులకూ తన కథనిలా కొనసాగించాడు.

ఆ ప్రకారం తృతీయుడు మెట్లెక్కి కొండ కొన చేరుకుని మోకాళ్ళమీద వంగి అల్లాను మరోసారి ప్రార్థించుకున్నాడు. ఆ తర్వాత అతడికి అలసట కారణంగా అక్కడే ఆ రాళ్ళమీదే వళ్ళు తెలియని నిద్ర పట్టేసింది.

నిద్రలో అతడికో గొంతు వినిపించింది, "కాసీబ్ తనయుడా! నిద్ర లేచాక నీ పాదాలవద్ద తవ్వితే ఒక ఇత్తడి విల్లు, మంత్రాక్షరాలున్న మూడు భాగాలు దొరుకుతాయి. వారి సంధించి బాణం విడిచి గుర్రపు రౌతును పడగొట్టు. తిరిగి నీ విల్లు, బాణాలను యధాస్థానంలో కప్పిపెట్టు. అప్పుడు సముద్రం విరగడం ప్రారంభిస్తుంది. నీరు పొంగి ఈ కొండ కోనను చేరుకుంటుంది. అప్పుడొక నావ నీ దగ్గరకు వస్తుంది. అందులో ఒక మనిషి అతడి చేతిలో పుర్రెలుంటాయి. నీవు ఆ నావ ఎక్కు. పొరపాటున కూడా పవిత్రమైన అల్లా పేరును ఉచ్చరించకు. పదిరోజుల్లో ఆ మనిషి నిన్ను సురక్షిత ప్రాంతానికి చేర్చుతాడు. అక్కణ్ణించి నీ రాజ్యానికి నీవు



పోవచ్చును. ఇదంతా అనుకున్న ప్రకారం జరగ డానికి నువ్వు తీసుకోవలసిన జాగ్రత్త ఒక్కటే! అల్లా పేరును తలవకూడదు. అంతే!"

తృతీయుడులిక్కి పడి నిద్రలేచాడు. పాదాలవద్ద తవ్వితే అతడికి విల్లు, బాణాలు కనిపించాయి. వాటితో గుర్రపు రౌతును కొట్టి తిరిగి వాటిని భూమిలో పాతేశాడతడు. ఆ తర్వాత సముద్రపు నీరు పొంగింది. నావ వచ్చింది. నావను చూస్తూనే తృతీయుడు మనసులో అల్లాకు కృతజ్ఞతలు తెలుపుకున్నాడు. అయితే నావ ఎక్కాక అల్లా నామాన్ని తలవ కూడదన్న విషయం కూడా అతడికి గుర్తుంది.

నావలో ఓ మనిషి ఉన్నాడు. చూడ్డానికతడు గుర్రపు రౌతులాగే ఉన్నాడు. అతడి ఛాతీ చుట్టూ మంత్రాక్షరాల కవచమున్నది.


తృతీయుడు నావ ఎక్కాడు. ఆ మనిషి వెంటనే తెడ్డు వేసి నావను నడిపించసాగాడు. అలా తొమ్మిది రోజులు గడిచాయి. పదవరోజు సాయంత్రానికి దూరంగా ద్వీపాలు కనపడడంతో తృతీయుడిక ఆనందం పట్టలేకపోయాడు. "అల్లా! నీవెంత దయామయుడివి! నీవు తప్ప మరో దేవుడు లేడు కదా!" అంటూ బిగ్గరగా అరిచాడు.

అంతే- నావను నడిపే మనిషి చటుక్కున తృతీయుడి చేయి పట్టుకుని సముద్రంలోకి విసిరేశాడు. అతడేం జరిగిందో తెలుసుకునేలోగా నావ మాయమైంది.

తృతీయుడు గజ ఈతగాడు. అతడొక రోజు రోజంతా నీటిపై తేలి ఉండగలిగాడు. ఆ తర్వాత అతడి కాళ్ళూ, చేతులూ నీరస పడిపోయాయి. ఇక తనకు చావు తప్పదనుకుంటూ అల్లాను ప్రార్థించాడు. అప్పుడో పెద్ద కెరటం అతడిపైకెత్తి ఓ ద్వీపం మీదకు విసిరేసింది.

నేలను చేరినందుకు తృతీయుడెంతో సంబర పడ్డాడు. అతడు తన బట్టలు విప్పి పిండి సముద్రపు ఒడ్డున ఇసుకపై ఆరబెట్టాడు. కాసేపు నిద్రపోయి లేచి పొడి బట్టలు కట్టుకుని ద్వీపమంతా తిరిగాడు. అప్పుడది అతడికి సముద్రంలో ఉండే ద్వీపాలన్నింటిలోకీ అతిచిన్నదై ఉంటుందనిపించింది. అక్కణ్ణించి తన జీవితం ఇంకా ఎలాంటి మలుపులు తిరుగుతుందోనని బెంగపడుతూండగా దూరంగా అతడికి సముద్రంలో ఒక ఓడ కనపడింది. అది ద్వీపం వైపే వస్తున్నది.

అసలే రోజులు బాగాలేవు. ఆ ఓడలో తన కోసం ఎలాంటి దౌర్భాగ్యం కాచుకుని ఉన్నదోనని బెంగపడి తృతీయుడు చటుక్కున కనబడిన చెట్టొక్కటి ఎక్కాడు. కొమ్మల చాటున దాక్కుని ఏం జరుగుతుందోనని చూడసాగాడు.




ఓడ ఒడ్డుకు చేరింది. లంగరు పడ్డాక అందులోంచీ పది మంది బానిసలు బైటకు వచ్చారు. వాళ్ళందరి చేతుల్లోనూ గునపాలూ, పారలూ ఉన్నాయి. వాళ్ళు నడుచుకుంటూ ద్వీపమధ్యానికి వెళ్ళారు. అక్కడ ఒకచోట కాస్త తవ్వి మట్టి తీశారు. అక్కడో నేలమాళిగ ఉన్నది. దాని తలుపును వారు పైకి ఎత్తారు.

తర్వాత ఆ బానిసలు మళ్ళీ ఓడ దగ్గరకు వెళ్ళారు. అందులోంచి రొట్టెలు, ధాన్యం, తేనె, వెన్న వగైరా పలురకాల ఆహార సామాగ్రిని దింపి నేలమాళిగలోకి చేర్చారు. ఆ తిండి ఎంత కాలానికోగానీ వాళ్ళు చాలాసార్లే ఓడ, నేలమాళిగల మధ్య సామానుమోస్తూ తిరిగారు. బరువైన సామానంతా అయ్యాక వారు అందమైన బట్టలు చేత్తో పట్టుకుని ఓడలోంచి బయటకు వచ్చారు. ఈసారి వారితోపాటు వయోవృద్ధుడొకడు బైటకు వచ్చాడు. ఆయన చేయి పట్టుకుని ముద్దులు మూటకట్టే బాలుడొకడు కూడా బయటకు వచ్చాడు. ఆ బాలుణ్ణి చూసి తృతీయుడెంత ముచ్చటపడ్డాడో మాటల్లో చెప్పడం కష్టం.

ఆ బృందం నేలమాళిగలోకి వెళ్ళింది. కొద్ది క్షణాల్లోనే ఆ బాలుడు తప్ప తతిమ్మా వారందరూ బైటకు వచ్చి ఓడలో వెనక్కు వెళ్ళిపోయారు.

అప్పుడు తృతీయుడు చెట్టు దిగాడు. నేలమాళిగ ప్రాంతం చేరుకున్నాడు. అక్కడి మట్టిని తొలగించాడు. తలుపు కనబడింది. ఎత్తబోతే ఆ తలుపెంతో బరువుగా ఉన్నది. అల్లాను తలచుకుని ఆ తలుపును పైకెత్తి చూస్తే క్రిందకు రాతి మెట్లు కనిపించాయి. అతడు క్రిందకు దిగాడు. మెట్లైపోయేక ముందుకు నడిచాడు. అప్పుడతడికి విశాలమైన గది కనబడింది.

ఆ గది అద్భుతంగా ఉంది. నేలమీద రత్నకంబళ్ళు పరచి ఉంటే గోడలకు పట్టు తెరలున్నాయి. గది మధ్యలో నేల బారు మంచమొకటి ఉన్నది.





దాని చుట్టూ కొవ్వొత్తులు వెలుగుతున్నాయి. పుష్ప గుచ్ఛాలున్నాయి. ఫలాలు, ఫలహారాలతో నింపిన పళ్ళెరాలున్నాయి.

ఆ మంచం మీద కూర్చుని ఉన్నాడొక బాలుడు. అతడొక ఖరీదైన వీవెనతో విసురుకుంటూ తృతీయుణ్ణి చూసి దిగ్భ్రాంతి చెందాడు.

తృతీయుడు ఆ బాలుణ్ణి సమీపించి, "భయ పడకు. నేను నీ శత్రువును కాదు. దుష్టుణ్ణీ కాను. నేనొక రాజును. అల్లా నన్నిక్కడకు పంపాడు. ఎవరైతే చావమని నిన్నిక్కడ పాతిపెట్టారో వారి బారి నుంచి నిన్ను రక్షిస్తాను. ఈ క్షణం నుంచీ మన మిద్దరం మంచి మిత్రులం" అన్నాడు.

ఆ బాలుడు ముద్దులొలికేలా నవ్వాడు. తృతీయుణ్ణి తన పక్కనే మంచం మీద కూర్చో పెట్టుకుని, "అయ్యా! నీవు పొరపడ్డావు. నేను చావడానికి కాదు- చావును తప్పించుకునేందుకే ఇక్కడకు వచ్చాను. నేనొక నగల వ్యాపారి ఏకైక పుత్రుణ్ణి. ప్రపంచంలోని ఎందరో రాజులకు నగల నమ్మి నా తండ్రి ఎంతో పేరుకాంచి ఉన్నాడు. నేనాయనకు లేక లేక పుట్టాను. అయితే జ్యోతిష్కులు నేను అల్పాయుష్కుడినన్నారు. నా తల్లిదండ్రుల కంటే ముందే నాకు కాసీబ్ అనే రాజు కొడుకు చేతిలో చావు రాసి పెట్టి ఉన్నదన్నారు. ఆ రాజ కుమారుడు అయస్కాంత పర్వతంమీద ఉండే గుర్రపు రౌతును పడగొట్టిన నలభై రోజులకు నా ప్రాణం తీస్తాడట. అందులోని నా తండ్రి నా గురించి బెంగపెట్టుకున్నాడు. నాకు పదిహేను సంవత్సరాల వయసు వచ్చేదాకా ఎండ కన్నెరక్కుండా అతి జాగ్రత్తగా పెంచి పెద్ద చేశాడు. ఇత్తడి గుర్రపు రౌతు సముద్రంలో పడ్డాడని తెలిసిన క్షణం నుంచీ నా తండ్రికి కంటిమీద కునుకులేదు. నా తల్లిదండ్రులు కంటికీ మంటికీ ఏకధారగా ఏడ్చారు. అలా ఏడ్చి ఏడ్చి మరీ ఎక్కువ వయసులేని నా తండ్రి పండు ముసలిగా మారిపోయాడు. ఆయన నేను పుట్టగానే జ్యోతిష్కులు చెప్పింది వినగానే ఇక్కడ నేల మాళిగను తవ్వించాడు. ఇక్కడకు ఆ కాసీబ్ తనయుడు రాలేదని మా నమ్మకం. అందుకే ఆయన నన్నిక్కడుంచి వెళ్ళాడు. ఇదీ నా కథ-" అని తన గురించి చెప్పుకున్నాడు.

ఈ కథవిని తృతీయుడు తెల్లబోయాడు. ఎవరి గురించైతే భయపడి ఆ బాలుడినక్కడ దాచారో ఆ మనిషి తనే! తనక్కడికి రానే వచ్చాడు. అయితే

జ్యోతిషాన్ని గుడ్డిగా నమ్మవచ్చా? "పరమ కిరాతకులు కూడా ఈ బాలుణ్ణి చంపలేరే- నేను వీడిని చంప డమా?" అనుకుని పైకి ఆ బాలుడితో, "అబ్బాయీ! అందమైన పుష్పానివి నువ్వు. దేవుడంటూ ఉంటే నీకే అపకారమూ జరుగదు. నిన్ను రక్షించడం కోసం నేను నీతో ఇక్కడే జీవితాంతం ఉండిపోతాను" అన్నాడు.


"నేనిక్కడ నలభై రోజులే ఉంటాను. ఆ తర్వాత నాకే ప్రమాదమూ ఉండదు కాబట్టి మా నాన్న వచ్చి నన్ను తీసుకుని వెడతాడు" అన్నాడు ఆ బాలుడు.

"అయితే మీ నాన్న వచ్చేదాకా నేనూ ఇక్కడే ఉంటాను. తర్వాత మీ నాన్న నడిగి నిన్ను నా రాజ్యానికి తీసుకుని వెళ్ళి నా వారసుణ్ణి చేస్తాను" అన్నాడు తృతీయుడు.

ఆ బాలుడు సరేనన్నాడు. కాసేపు మాట్లాడుకునే సరికే వారిద్దరికీ ఒకరి మీద ఒకరికెంతో ప్రేమ, అభిమానం పుట్టుకొచ్చాయి. బాలుడతణ్ణి భోం చేయ మంటే తృతీయుడు ముందు తట పటాయించాడు. అప్పుడా బాలుడు నవ్వి, "ఒక ఏడాదిపాటు వంద మందికి ప్రతిరోజూ ఆతిథ్యమిచ్చినా తరగనంత ఆహారం ఇక్కడుంది. తటపటాయించకు" అంటూ ఆప్యాయంగా చెప్పాడు.

ఆ రాత్రికిద్దరూ భోం చేసి పడుకున్నారు.

ఆ తర్వాత ప్రతిరోజూ ఇద్దరూ కబుర్లు చెప్పు కుంటూ పుష్టుగా భోం చేస్తూ ఒకరికొకరు తోడుగా నలభై రోజులూ ఇట్టే గడిపేశారు. తృతీయుడా బాలుడిచేత రోజూ తనే స్వయంగా స్నానం చేయించేవాడు. కొన్ని వంటకాలను వండి



పెట్టేవాడు. నలభైయవ రోజున అతడా బాలుడి కోసం ఎప్పటి లాగే పెద్ద గంగాళంతో వేణ్ణీళ్ళు కాచి గోరు వెచ్చగా ఉండేలా తోరిపాడు. తనే స్వయంగా వళ్ళుతోమి అతడిచేత స్నానం చేయించాడు. అతడి వంటిపై పరిమళ ద్రవ్యాలు చల్లి ఎత్తుకుని వెళ్ళి మంచంమీద పడుకోబెట్టాడు. వంటిమీద బొంత కప్పాడు. తలకు పట్టు గుడ్డలు చుట్టాడు. తాగడానికి షర్బతునిచ్చాడు. అప్పుడా బాలుడికి వళ్ళు తెలియని నిద్ర పట్టింది.

ఆ బాలుడు నిద్రలేచాక ఆకలి అన్నాడు. అప్పుడు తృతీయుడో పెద్ద పుచ్చకాయను తీసుకుని ఆ బాలుడి పక్కన పళ్ళెంలో ఉంచాడు. పుచ్చ కాయను కోయడానికి కత్తి కోసం చూస్తే అది ఆ బాలుడి తలమీదే గోడకు వ్రేలాడుతోంది.


ఆ కత్తిన అందుకుందుకు తృతీయుడు మంచమెక్కాడు. అతడు కత్తిని తీయడానికి ప్రయత్నిస్తూంటే బాలుడు కాళ్ళకు కితకితలు పెట్టాడు. వద్దు వద్దన్నా వినలేదు. ఆ బాలుడి కదో ఆటలా ఉంది. దాంతో తృతీయుడు పట్టు తప్పి మంచం మీద ముందుకు పడ్డాడు. బాలుడు కూర్చుని ఉన్నవాడల్లా వెల్లకితలా పడ్డాడు. కత్తి గోడ మీంచీ జారి తిన్నగా ఆ బాలుడి గుండెల్లోకీ చొచ్చుకునిపోయింది. అప్పటికప్పుడే అతడి ప్రాణాలుపోయాయి.

తృతీయుడు నెత్తీ నోరూ బాదుకుని ఏడ్చాడు. తనకు చావునివ్వమని అల్లాను ప్రార్థించాడు. జ్యోతిష్కులు చెప్పింది నిజమైందని వగచాడు. ఇక అక్కడ ఉండలేక మెట్లెక్కి నేలమాళిగలోంచీ బయటకు వచ్చాడు. ఇక వయోవృద్ధుడూ, బానిసలూ వచ్చే సమయమైందని గ్రహించి నేలమాళిగ తలుపు మూసి దాన్ని మట్టితో కప్పి అక్కడకు దగ్గర్లో ఉన్న పెద్ద చెట్టెక్కి కొమ్మల మాటున దాక్కుని జరగబోయేది చూడసాగాడు.


కాసేపటికి వయోవృద్ధుడి బృందం వచ్చింది. నేల మాళిగ దగ్గర మట్టి అప్పుడే కదిపినట్లుండడం చూసి వారు బెంగపడ్డారు. కాసేపటికా బెంగ ఏడుపయింది. అందరూ వెక్కుతూ ఏడుస్తూ ఆ బాలుడి శవాన్ని బైటకు తెచ్చి అక్కడే మట్టిలో కప్పెట్టి తిరిగి ఓడలో వెనక్కు వెళ్ళిపోయారు.

తృతీయుడా చిరుద్వీపంలో ఒంటరిగా కొద్ది రోజులు తిరిగేక క్రమంగా సముద్రం వెనక్కు తగ్గి దానికీ మరో పెద్ద ద్వీపానికీ దారి ఏర్పడింది. అల్లానే స్మరించుకుంటూ తృతీయుడు కొత్త ప్రాంతం చేరుకుని సూర్యాస్తమయం అయ్యేదాకా తిరిగుతూనే ఉన్నాడు. అప్పుడతడికి దూరంగా ఎర్రని పెద్ద మంట కనబడింది. అక్కడెవరో వంట చేసుకుంటూ ఉంటారన్న ఆశతో వడివడిగా తృతీయుడక్కడికి వెడితే ఆ మంట మంటకాదు- అస్తమిస్తున్న సూర్యబింబం. అయితే ఆ బింబానికి సమీపంలో ఒక పెద్ద ఇత్తడి భవనం అతడి కంటపడింది...

(ఇంకా ఉంది)



కుక్క తోక పట్టుకుని గోదావరి ఈదినట్లు...



ఒక ఊళ్ళో సీతమ్మ, రామయ్య అనే పుణ్య దంపతులున్నారు. ఎన్ని పూజలు, నోములు చేసినా వారికి సంతాన భాగ్యం కలగలేదు. బిడ్డను చేరదీసి లాలించాలని సీతమ్మ తహ తహలాడుతూంటే పుత్రులు లేక పున్నామ నరకం పాలు కాక తప్పదని రామయ్య దిగులు పడసాగాడు.

ఆ దంపతులకు దూరపు బంధువైన కోటయ్య భార్య, కొడుకుతో సహా ఎక్కడికో వెడుతూ ప్రమాదానికి గురయ్యాడు. భార్యా భర్తలిద్దరూ అక్కడికక్కడే మరణించారు. రెండేళ్ళ వయసున్న వారి బిడ్డ చంద్రం ఉన్నట్లుండి అనాథ అయిపోయాడు. చేసేది లేక మేనమామలే ఆ కుర్రాణ్ణి చేరదీశారు.

ఈ విషయం రామయ్య దంపతులకు తెలిసింది. వాళ్ళు చంద్రాన్ని పెంచుకుంటే తమకు బిడ్డలు లేనిలోటు తీరుతుందనీ, పున్నామ నరకం బాధ తప్పుతుందనీ అనుకున్నారు. చంద్రం మేనమామల వద్దకు వెళ్ళి అడిగితే వాళ్ళు సంతోషంగా కుర్రాణ్ణి వాళ్ళకు అప్పగించారు.

చంద్రాన్ని చూసి సీతమ్మ మురిసిపోయేది. వాడికి ఏ కష్టమూ తెలియకుండా అల్లారు ముద్దుగా పెంచసాగింది. అయినా పొరపాటున ఎప్పుడైనా ఆమె వాడిని విసుక్కుంటే ఇరుగు పొరుగులు, "కన్న బిడ్డ కాదు కదా! విసుక్కోవడం సహజమే!" అనేవారు.

ఇది సీతమ్మకూ, రామయ్యకూ కూడా బాధగా ఉండేది. ఇరుగు పొరుగులకు భయపడి వాళ్ళు చంద్రాన్ని పల్లెత్తు మాట కూడా అనేవారు కాదు. వాడేమి చేసినా సహించేవారు.

ఆ విధంగా చంద్రానికి చిన్నప్పట్నించీ ఆడింది ఆటగా, పాడింది పాటగా సాగింది. దాంతో వాడు పెంకితనం అలవాటు చేసుకున్నాడు. ఎదుగుతున్న కొద్దీ చెడు సావాసాలు పట్టాడు.

పదహారేళ్ళకే పూర్తిగా చెడిపోయిన కొడుకును చూసి రామయ్య దంపతులిద్దరూ బాధపడుతూంటే ఇరుగు పొరుగులు జాలి పడడానికి బదులు, "మీకు పిల్లలను పెంచడం రాదు. అందుకే దేవుడు మీకు పిల్లల్నివ్వలేదు. అది గ్రహించక మీరు చంద్రాన్ని


పెంపకానికి తెచ్చుకున్నారు. మేనమామల వద్ద పెరిగితే చంద్రం బుద్ధిమంతుడై ఉండేవాడు. మీ వద్దకు వచ్చి చెడిపోయాడు." అని వాళ్ళనే తప్పు పట్టారు.

అప్పుడు రామయ్య భార్యతో, "మనం చంద్రాన్ని మందలిస్తే ఇరుగు పొరుగులేమైనా అంటారని భయపడ్డాం. పిల్లల పెంపకంలో ఇరుగు పొరుగుల మాటకు విలువివ్వడం కుక్కతోకను పట్టుకుని గోదావరీదడం వంటిది. ఇప్పుడు మనం చంద్రం చెడిపోతే ఇరుగు పొరుగులు అందుకూ మననే తప్పుపడుతున్నారు. ఇప్పటికైనా మించిపోయింది లేదు. నేను చంద్రాన్ని మంచి దారిలో పెడతాను" అన్నాడు.

తర్వాత రామయ్య చంద్రాన్ని పిలిచి, "నీ వ్యవహారం నాకు నచ్చలేదు. బుద్ధిగా ఉండకపోతే, నేను చెప్పినట్లు నడుచుకోకపోతే నేను నిన్ను ఇంట్లోంచి బయటకు గెంటేస్తాను" అన్నాడు.

చంద్రం నవ్వి, "మీకు నేను బిడ్డలు లేని లోటు తీర్చాను. పున్నామ నరకం బాధ తప్పించాను. నన్నింట్లోంచి ఎందుకు గెంటుతారు? నేనిలాగే ఉంటాను. ఇక్కడే ఉంటాను" అన్నాడు మొండిగా. అలా చెప్పమని వాడిని వాడి స్నేహితులు ప్రోత్సహించారు.

రామయ్య దీనికి చలించక, "అల్లరి చిల్లరిగా తిరిగే నీ వంటి వాడివల్ల బిడ్డలు లేని లోటు తీరదు. నీ ప్రవర్తనతో నలుగురిలో తలెత్తుకో లేకుండా ఉన్న మాకు ఎప్పుడో వచ్చే పున్నామ నరకం బాధ ఇప్పుడే కలుగుతోంది. మా సమస్యల పరిష్కారానికి నిన్ను నమ్ముకోవడం కుక్కతోక పట్టుకుని గోదావరి ఈదినట్లే ఉంది. బాగా ఆలోచించుకో. నువ్వు మేము చెప్పినట్లు



వింటావో, నీ స్నేహితులు చెప్పిన ప్రకారం వింటావో మరి!" అన్నాడు.

చంద్రం తన స్నేహితులను సంప్రదించాడు. వాళ్ళు వాడితో, "భయపడకు. మేమందరం నీకు అండగా ఉంటాం. ఇంట్లోంచి వెళ్ళిపోతానని నువ్వే నీ పెంపుడు తండ్రిని బెదిరించు. ఆయనే దిగి వస్తాడు. అందుకు నువ్వు చేయాల్సినదల్లా కొన్నాళ్ళపాటు ఇల్లు వదిలి బయట ఉండడమే! నీ తండ్రి దిగి వచ్చే దాకా మేము నీకు ఆశ్రయమిస్తాం!" అన్నారు.

స్నేహితులు మాటమీద చంద్రం తండ్రితో గొడవ పెట్టుకున్నాడు. రామయ్య వాడిని ఇంట్లోంచి పొమ్మన్నాడు. వాడు వెళ్ళిపోయాడు.

రామయ్య దిగి వస్తాడనే అంతా అనుకున్నారు. కానీ ఆయన ఇరుగు పొరుగుల మాటల్ని లెక్క చేయలేదు. కొడుకు బెదిరింపులకు లొంగలేదు.

విసిగిపోయిన స్నేహితులు క్రమంగా చంద్రాన్ని చిన్న చూపు చూడసాగారు. అది భరించలేక చంద్రం వాళ్ళను సంజాయిషీ అడిగితే, "నీకు సకల మర్యాదలూ చేసి ఆదరించడానికి నువ్వేమైనా రాజకుమారుడివా ఏమన్నానా? అలా కాకున్నా నిన్ను పోషించడానికి మా దగ్గరేమైనా నిధులున్నాయా? అనాథ బిడ్డవు. చేరదీసిన పెంపుడు తలిదండ్రులతోనే సర్దుకోలేని వాడివి మాతో ఏముండగలవు? ఇక నిన్ను పోషించడం మావల్ల కాదు. అవతలకు ఫో!" అనేశారు వాళ్ళు.

అప్పటికి చంద్రానికి స్నేహితుల అసలు రంగు తెలిసింది. వాళ్ళ మాటలు నమ్మి ఇల్లొదిలి పెట్టడం కుక్కతోకను పట్టుకుని గోదావరి ఈదినట్లే అయిందని గ్రహించాడు. బుద్ధి తెచ్చుకుని, వాడు పెంపుడు తలిదండ్రుల వద్దకు వెళ్ళి తనను క్షమించమని అడిగాడు.

"నువ్వూ మేమూ కూడా కుక్కతోకను పట్టుకుని గోదావరి ఈదడానికి ప్రయత్నించడంవల్లే ఈ ఇబ్బందులు వచ్చాయి. ఇకమీదట మనం మన తప్పులు సవరించుకుందాం" అన్నారు సీతమ్మ, రామయ్య వాడితో. ముగ్గురూ అది గ్రహించేక చంద్రం బాగుపడ్డానికి ఎంతో కాలం పట్టలేదు.



ప్రశ్నలు - జవాబులు

'అనీమియా' అంటే ఏమిటి?

మన శరీరంలో రక్తం తన పని సక్రమంగా కొనసాగించడానికి దోహదం చేసేది ఇనుము. ఈ ఇనుము ఆహార పదార్థాల ద్వారా శరీరంలోని చేరుకుంటుంది. అనీమియా అంటే రక్తహీనత. ఇది రక్తంలో ఇనుము తగ్గడంవల్ల ఏర్పడుతుంది. ప్రపంచంలో 30 శాతం ప్రజలు ఇనుము తగ్గి రక్తహీనతవల్ల బాధపడుతున్నారంటే- అనీమియా నివారణ ఎంత ముఖ్యమో తెలుసుకోవచ్చు. రక్తంలో హెమోగ్లోబిన్ ఎంత ఉన్నదీ పరీక్షించడం ద్వారా ఇనుమును అంచనా వేయవచ్చు. ఆరు మాసాల నుంచి ఆరు సంవత్సరాల పిల్లల వరకూ 110, 6 నుంచి 14 సంవత్సరాల పిల్లలకు 120, పురుషులకు 130, స్త్రీలకు 120, గర్భిణీ స్త్రీలకు 110 హెమోగ్లోబిన్ ఉండాలి. అంతకు తగ్గితే అనీమియా.

వేసవిలో 'ఈగలు' ఎందుకు ఎక్కువ అవుతాయి?

ఇళ్ళల్లో కనబడే ఈగకు శాస్త్రీయ నామం ముస్కా నెబ్యులో. ఈగలు గ్రుడ్లను చెత్త, చెదారం, కుళ్ళిన పదార్థాలు, పేడ వగైరాల మీద పెడతాయి. ఒకేసారిగా 120 నుంచి 160 దాకా ఈ గ్రుడ్లను పెడితే ఉష్ణోగ్రతను బట్టి అవి 8 నుంచి 24 గంటల్లో పొదగబడతాయి. అవి వారం రోజుల లోపల తెల్ల ఈగలుగా మారతాయి. సరైన ఉష్ణోగ్రత ఉంటే అవి మరో 5 రోజుల్లో ఇటుక రంగు పెద్ద ఈగలవుతాయి. ఈ మార్పులకవసరమైన తేమ, వేడి వేసవిలో అమరడంవల్ల ఈగలు జనాభా మార్చి నుండి అక్టోబరు దాకా అధికంగా ఉంటుంది.

వసుంధర

'చలికాలంలో వంటికంటే వేళ్ళు చల్లగా ఉంటాయి ఎందుకు?'

రెండు అల్యూమినియం కప్పులు తీసుకోండి. ఒకటి బాగా పెద్దది. ఒకటి మరీ చిన్నది. రెండింట్లో గోరు వెచ్చటి నీళ్ళు పోయండి. కాసేపటికి రెండూ చల్లబడతాయి. ఈ చల్లబడడం ఉపరితలం వైశాల్యం మీదనే కాక- ఆ వైశాల్యానికి మొత్తం ఘన పరిమాణంలో ఉన్న నిష్పత్తిమీద ఆధారపడి ఉంటుంది. అలా పోల్చితే చిన్న కప్పు ఉపరితల వైశాల్యం బాగా ఎక్కువ. అందుకని అందులో నీళ్ళు తొందరగా చల్లబడతాయి. మన శరీరం కూడా వేడిని నిలవుంచే ఒక కప్పులాంటిది. వేడిని ఒకస్థాయిలో ఉంచేందుకు అన్ని శరీరభాగాలకూ ఉష్ణాన్ని పంచే ఏర్పాటుంది శరీరంలో. చలికాలంలో బయటి చల్లదనానికి వళ్ళు కూడా చల్లబడితే శరీర భాగాలన్నింటికీ వెంటనే ఉష్ణం సరఫరా అవుతుంది. మిగతా శరీరం పెద్ద కప్పులాగా, వ్రేళ్ళు ముక్కు చిన్న కప్పులాగా ప్రవర్తించడంతో మిగతా శరీరం కంటె వ్రేళ్ళు, ముక్కు చల్లగా ఉండడం జరుగుతుంది.

ఒక్కలాగే ఉండే కవలల వేలి ముద్రలు ఒక్కలాగే ఉంటాయా?

ఉండవు. కవలలతో సహా ఈ ప్రపంచంలో ఏ యిద్దరి వేలి ముద్రలూ ఒక్కలా ఉండవు.

'శస్త్ర చికిత్స జరిగాక నొప్పి ఇంకా ఉంటుందా?'

చాలా మందికి ఉంటుంది. అందుకు కారణం శస్త్ర చికిత్సా సమయంలో నరాలు స్వీకరించిన బాధ - మత్తు మందు ప్రభావం తొలగిపోగానే మెదడుకు చేరగలగడం. శస్త్ర చికిత్సకు ముందే నొప్పిని పోగొట్టే మందులు వేసుకుంటే నరాలకా బాధ చేరదు. అందువల్ల శస్త్ర చికిత్స అయినాక మెదడు కవి బాధకు సంబంధించి సందేశాలేవీ అందజేయవు. కాబట్టి గుర్తుంచుకోండి. మనను గాయాల కంటే ఎక్కువగా బాధ పెట్టేవి జ్ఞాపకాలు. ఈ జ్ఞాపకాల బాధ మనకు నరనరాల్లోనే ఉంది.

కొన్ని అంకెలు మరీ తమాషాగా వుంటాయి. అంకెల తమాషాలో ఏడు అంకె ప్రముఖపాత్ర వహిస్తుంది. పరిశోధనకి తగినంత ఆసక్తినీ, ప్రేరణనూ యిస్తుంది ఏడు అంకె.

ప్రాచీన అసేరియన్లకూ, బాబిలోనియన్లకూ ఏడు అంకె పవిత్రమైనది. పైథాగరస్ సిద్ధాంతవేత్తలకు ఏడు పరిపూర్ణమైన సంఖ్య. అలా సిద్ధాంతీకరించడానికి వాళ్ళు చెప్పే వివరణ అతి విచిత్రంగా వుంటుంది. మూడూ నాలుగూ కలిస్తే ఏడు. త్రిభుజం యొక్క భుజాలు మూడు. చదరం యొక్క భుజాలు నాలుగు, మూడు త్రిభుజాన్ని నాలుగు చదరాన్నీ సూచిస్తున్నాయి.

బైబిలులో ఏడు గురించిన చాలా ప్రస్తావనలున్నాయి. విచిత్రం ఏమంటే ఏడేళ్ళ కాలం చాల ఎక్కువ కాలానికి ఒకచోట సూచన అయితే, మరోచోట ఏడేళ్ళు స్వల్పకాలం. మనిషి ఆత్మలో ఏడురకాల పదార్థాలుంటాయట. వాటిని ఏడు గ్రహాలు అదుపులో వుంచుతాయట. సూర్యకుటుంబంలో ఏడు గ్రహాలున్నట్టు నమ్మే అజ్ఞాన దశలో వన్నప్పటి మూఢ నమ్మకం యిది.

ఏడు కొండల మీద రోమ్ నగరం నిర్మించబడినట్టు మనం విన్నాం. ఫారో, ఏడు బలిసిన ఎద్దులను కలలో చూశాడట. గ్రీసు దేశంలో ఏడుగురు ఋషులు వుండేవారు. విజ్ఞానానికి మూల స్తంభాలు ఏడు. ప్రపంచసృష్టికి ఏడేఏడు రోజులు పట్టిందని నమ్మడం మరో మూఢనమ్మకం. ఈ నమ్మకం వున్న వాళ్ళకి పరిణామ సిద్ధాంతం చెప్పి లాభం లేదు.

వారానికి ఏడు రోజులే కదా! సుగుణాలు ఏడు, అవి విశ్వాసం, ఆశ, దానం, ఆహారపాన భోగాల్లో మితత్వం, వివేకం, న్యాయం, ధైర్యం. అలాగే వ్యసనాలూ ఏడే... గర్వం, ఉగ్రకోపం, అసూయ, కామం, తిండిపోతుతనం, అత్యాశ, సోమరితనం.

ప్రపంచాద్భుతాలు ఏడు, రోమ్‌లోని బ్రహ్మాండమైన విగ్రహశాల, చైనాగోడ, పీసాలో ఒరిగిపోయే గోపురం, నార్‌కింక్‌లోని ప్రొసిలిన్ గోపురం, ఆగ్రాలోని తాజ్‌మహల్, సెయింట్ సోఫియంలోని మసీదు, బీజాపూర్‌లోని గుసగుసలాడే గ్యాలరీ అవి.

పవిత్ర గ్రంథాలు ఏడు. వేదాలు, జెండ్ అవెస్తా, బౌద్ధుల త్రిపిటకాలు, బైబిలు, కొరాన్, చైనా చక్రవర్తులు అయిదుగురి చరిత్రా, స్కాండినేవియన్ల ఎడ్డాలూ అవి.

చరిత్రలో సైతం ఏడు అంకెకు బలమైన అడుగుజాడలున్నాయి. 18వ శతాబ్దంలో ఏడు సంవత్సరాల యుద్ధం జరిగిందని మనం చదివాం. ఏడుగురు బిషప్పులను విచారణ చేశారు. జేమ్స్ II కాలంలో రాజద్రోహం నేరం ఆరోపించి చివరకు విడుదల చేశారు.

భారతీయ జానపద సాహిత్యంలో ఏడు ప్రముఖమైనది. మన రాజులకు ఏడుగురు కొడుకులుంటారు. మరో రాజుకున్న ఏడుగురు కూతుళ్ళను పెళ్ళి చేసుకుంటారు. ఇండియా-ఐరోపా నాగరికత విస్తరించక ముందే మనకి ఈ ఏడు మీద కథలు విస్తరించి వున్నాయి. వేద ఋషులు ఏడుగురు, కర్మకాండలు ఏడు. అన్ని సాంప్రదాయాల్లో సముద్రాలు ఏడు. అంకెల శాస్త్రంలో ఏడుకు ప్రాధాన్యత వుంది. మనిషికి అతడి ఏడో ఏట మొదటిసారిగా పాలదంతాలు రాలిపోతాయి. రెండు ఏడులకు యవ్వనం ప్రారంభమవుతుంది. మూడు ఏడులకు వయో జనుడవుతాడు, పదిఏడులకు వృద్ధుడవుతాడు. ఏడో సంతానం అయిన మగవాడు కోరుకున్న వాటిని సాధిస్తాడు.

విచిత్రమైన 7 అంకె

ఈ క్రింద నున్న బొమ్మలోని
వాళ్ళు ఏం మాట్లాడుకుంటే
నవ్వు వస్తుందో, ఆ సంభాషణ వ్రాసి,
ఈ సంచిక విడుదలైన పది రోజులలోగా
మాకు పంపకోరుతున్నాం. వాటిలో బాగున్న
అయిదింటిని ఎన్నుకొని, ఒకోదానికి
రూ. 50/- చొ॥న పంపుతాం. సంభాషణలు
కార్డుమీద మాత్రమే వ్రాసి
పంపాలన్నది షరతు.



బొమ్మల సంభాషణ

80, ధనలక్ష్మీ కాలనీ, వడపలని, మద్రాసు-26.

'లా'

రామనాథంగారి యిల్లు కాలిపోతోంది. ఫైరు యింజన్ల వాళ్ళు నాలుగు పక్కల నుంచి నీళ్ళ గొట్టాలు పట్టుకుని, నిప్పును ఎలాగయినా అదుపులోనికి తేవాలని తంటాలు పడుతున్నారు. ఈ సందర్భంలో వాళ్ళు పక్క యింటి తోటలో నుంచి పని చేయవలసి వచ్చింది. నలుగురయిదుగురు మనుషులు నీళ్ళ గొట్టాలు పట్టుకొని ఆ యింటి తోటంతా 'కసబిస' తొక్కేశారు. ఎలాగయితేనేం గంటసేపు తంటాలు పడి నిప్పును ఆర్పేశారు.

అయితేనేం, పక్క యింటి యజమాని శేషాచలంగారు తన తోట అంతా నిష్కారణంగా తొక్కి పాడు చేశారని, తన ఆవరణలోనికి వాళ్ళను ఆహ్వానించనే లేదని ఫైరు సర్వీస్ వాళ్ళమీద కేసు పెట్టాడు. తనకు నష్ట పరిహారం యిప్పించాలని అడిగారు.


'లా'

కోర్టు అంగీకరించలేదు.
ఆపద సమయంలో ఎవరి
ఆహ్వానమూ అక్కర్లేదనీ, ఫైరు
సర్వీసువాళ్ళు ప్రజాక్షేమం దృష్ట్యా
వ్యవహరించారనీ, శేషాచలంగారికి
నష్టం జరిగినా దానికి ఎవరూ
బాధ్యులు కారనీ స్పష్టంగా
చెప్పారు.


బాణసంచాలు వెలుగునైతే
విరజిమ్ముతాయి.
కానీ, జాగ్రత్త లేకపోతే అవి జీవితాలను
అంధకారమయం చేస్తాయి.

BOMMARILLU November 1998 Regd No.M89/4/97 RNI No.24313/71

BOMMARILLU



పై పక్క కొన్ని బొమ్మలిచ్చాం. కారుని కారు అనవచ్చు. వాహనం అని కూడా అనవచ్చు. ప్రతి బొమ్మకీ ఏదోక పేరు పెడతా కనుక ప్రతి పేరులో గల మొదటి అక్షరాలను కలిపితే పదాలు (వాక్యాలు కాదు) తయారవుతాయి. ఎక్కువ పదాలు తయారుచేసి వారికి వేయి నూటపదహార్లు పంపిస్తాం. ఏ పదంలో యిరక కుండా ఎక్కువ అక్షరాలు మిగిలిపోయేలా, బొమ్మలకు పే పెట్టిన వారిని కూడా మెచ్చుకోదలిచాం. వారికి కూడా వేయినూటపదహార్లు పంపిస్తాం. ఇప్పుడే మీకు కనిపిస్తున్న బొమ్మలక పేర్లు పెట్టడం ప్రారంభించండి. 15వ తారీఖు లోపల మీ జవాబులు అందాలి.

బొమ్మరిల్లు, 80, ధనలక్ష్మి కాలనీ, చెన్నై - 600 026.